# 40. అల్ మూ'మిన్ (విశ్వాసి) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 85 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా ఏకదైవారాధన, ప్రవక్తల పరంపర, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం గురించి నొక్కి చెప్పింది. ఈ సూరా దేవుడు అవతరింపచేస్తున్న దివ్యవాణి గురించిన ప్రస్తావనతో ప్రారంభమయ్యింది. అల్లాహ్‌ను తప్పులను క్షమించే క్షమాశీలిగా అభివర్ణించింది. ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. కఠినంగా శిక్షిస్తాడు. అపార దయామయుడు. ఆయన తప్ప మరో దైవం లేడు. కేవలం అవిశ్వాసులు మాత్రమే దేవుని చిహ్నాల గురించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తారు. వారు స్పష్టంగా కనబడుతున్న ఈ చిహ్నాలను వ్యతిరేకించాలని నిర్ణయించు కున్నారు. దేవుని చిహ్నాలు మనలను చుట్టుముట్టి ఉన్నాయి. ఇవి అన్నీ దేవుని ఏకత్వాన్ని చాటిచెబుతున్నాయి. ఆయన శక్తిసామర్థ్యాలను ప్రకటిస్తున్నాయి. గతకాలానికి చెందిన జాతులు కూడా సత్యాన్ని తిరస్కరించాయి. దేవుని చిహ్నాలకు వ్యతిరేకంగా వాదించాయి. ఈ సూరాలో అనేకమంది గతకాలాలకు చెందిన ప్రవక్తలను గురించి ప్రస్తావించడం జరిగింది. వారి ప్రజలు ఆయా ప్రవక్తలను తిరస్కరించారు. ఎగతాళి చేసారు. వారికి వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. వారిని మంత్రగాళ్ళుగా పిలిచారు. వారితో పిడివాదాలకు దిగారు. సత్యాన్ని తిరస్కరించడానికి అబద్ధపు వాదనలు చేసారు. నూహ్ (అస), హూద్ (అస), యూసుఫ్(అస), సాలిహ్ (అస)ల గురించి ఈ సూరాలో క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. మూసా(అస) గురించి వివరంగా ప్రస్తావన వచ్చింది. ఫిర్ఔన్‌కు వ్యతిరేకంగా మూసా (అస) పోరాటం గురించి వివరించింది. ఫిర్ఔన్ మూసా (అస) సందేశాన్ని వ్యతిరేకించాడు. ఆయన్ను చంపడానికి కుట్రలు పన్నాడు. అహంకారంతో ఫిర్ఔన్, మూసా(అస)ను ఎగతాళి చేయడానికి తన దర్బారులో ఉన్న హామాన్‌తో ఒక పెద్ద స్థూపం నిర్మించమని చెప్పాడు. ఆ స్థూపాన్నెక్కి మూసా చెప్పే దేవుడిని చూసొస్తానని అపహాస్యం చేసాడు.

దేవుని ఔన్నత్యాన్ని కొనియాడే దైవదూతల గురించి ఈ సూరాలో ప్రస్తావించ బడింది. దైవదూతలు అల్లాహ్‌ను స్మరిస్తూ, స్తుతిస్తూ, విశ్వాసుల కోసం క్షమాభిక్షను అర్థిస్తూ ఉంటారు. నరకాగ్ని బాధ నుంచి విశ్వాసులను కాపాడమని, వారికి స్వర్గవనాలు ప్రసాదించ మని, వారిని వారి తప్పుల నుంచి రక్షించమని దైవదూతలు దేవుణ్ణి ప్రార్థిస్తుంటారు.

## 40. అల్ మూ'మిన్[1] సూరా

## سُورَةُ الْمُؤْمِن

అవతరణ : మక్కా ఆయతులు : 85

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝

**1 – 2** హా మీమ్. ఈ గ్రంథావతరణ[2] అల్లాహ్ తరఫున జరిగింది. ఆయన మహా శక్తిమంతుడు, సర్వం తెలిసినవాడు.[3]

حٰمٓ ۝١ تَنْزِيْلُ الْكِتٰبِ مِنَ اللّٰهِ الْعَزِيْزِ الْعَلِيْمِ ۝٢

**3** పాపాలను క్షమించేవాడు, పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు,[4] కఠినంగా శిక్షించే వాడు,[5](అనంతంగా) అనుగ్రహించేవాడు[6]

غَافِرِ الذَّنْۢبِ وَقَابِلِ التَّوْبِ شَدِيْدِ الْعِقَابِ ذِى الطَّوْلِ

1. ఈ సూరానే **ఘాఫిర్** ( غَافِر) సూరాగా, **తౌల్** (الطَّوْل) సూరాగా కూడా వ్యవహరిస్తారు.
2. అంటే ఇది అల్లాహ్ తరఫున పంపబడిన గ్రంథం అన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు.
3. ఆయన గొప్ప శక్తిశాలి, అన్నింటిపై అదుపు కలిగి ఉన్నవాడు. ఆయన సమక్షంలో, ఆయన అనుజ్ఞ లేకుండా ఎవరూ ఏమీ చేయలేరు. ఆయన మహాజ్ఞాని, అన్నీ తెలిసినవాడు. లోకంలోని ఏ చిన్న వస్తువు కూడా ఆయన నుండి దాగిలేదు. అది ఎన్ని పొరలలో చుట్టబడి ఉన్నాసరే, దాన్ని ఆయన గమనిస్తూనే ఉన్నాడు. ఆయన సూక్ష్మగ్రాహి.
4. ఆయన గతంలో దాసులవల్ల జరిగిన పాపాలను మన్నించేవాడు, భవిష్యత్తులో జరిగే పొరపాట్లపై దాసుల పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు. లేదా తన నేస్తాల పాలిట క్షమాశీలి. తనను తిరస్కరించేవారు గనక పశ్చాత్తాపం చెందితే వారి పశ్చాత్తాపాన్ని దయతో స్వీకరించేవాడు అని భావం.
5. పరలోక జీవితంపై ఇహలోక జీవితానికి ప్రాధాన్యతనిచ్చి, అహంకారంతో విర్రవీగే వారి పాలిట ఆయన చాలా కఠినుడు. "నేను క్షమించేవాణ్ణి, కనికరించేవాణ్ణి. మరి నా శిక్ష కూడా వ్యధాభరితమైనదే అని ఓ ప్రవక్తా! నా దాసులకు తెలియపరచు" (అల్ హిజ్ర్ – 49, 50) అన్న సూక్తులు కూడా గమనించదగినవి. దివ్య ఖుర్ఆన్‌లో చాలాచోట్ల – ఒకే సమయంలో – దేవుని ఈ రెండు గుణాలు వివరించబడ్డాయి. మానవుడు ఒకవైపు దేవుని శిక్షకు భయపడుతూ, మరోవైపు ఆయన కారుణ్యం పట్ల ఆశపెట్టుకుని ఉండాలన్నదే ఇందలి మర్మం. ఎందుకంటే పొద్దస్తమానం భయపెడుతూ ఉంటే మానవుడు దైవకారుణ్యం పట్ల, క్షమాభిక్ష పట్ల నిరాశ చెందుతాడు. మరి అహోరాత్రులు అభయం ఇస్తూనే ఉంటే అతను విచ్చలవిడిగా పాపాలు చేస్తూపోతాడు.
6. **'తౌల్'** అంటే కలిమి అని అసలు అర్థం. అంటే ఆయన అపారంగా కలిమిని

لَآ اِلٰهَ اِلَّا هُوَ ۭ اِلَيْهِ الْمَصِيْرُ ③

– ఆయన తప్ప వేరే ఆరాధ్య దైవం లేడు. ఆయన వద్దకే మరలిపోవలసి ఉన్నది.

مَا يُجَادِلُ فِيْٓ اٰيٰتِ اللّٰهِ اِلَّا الَّذِيْنَ كَفَرُوْا فَلَا يَغْرُرْكَ تَقَلُّبُهُمْ فِي الْبِلَادِ ④

**4** సత్యతిరస్కారులు మాత్రమే అల్లాహ్ వాక్యాల విషయంలో వాదులాడుతారు.[7] కాబట్టి పట్టణ ప్రాంతాలలో వారి స్వైర విహారం నిన్ను మోసపుచ్చకూడదు సుమా![8]

كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوْحٍ وَّالْاَحْزَابُ مِنْۢ بَعْدِهِمْ ۠ وَهَمَّتْ كُلُّ اُمَّةٍۢ بِرَسُوْلِهِمْ لِيَاْخُذُوْهُ وَجٰدَلُوْا

**5** వీరికి పూర్వం నూహ్ జాతి వారు, వారి తరువాత వచ్చిన వర్గాల వారు కూడా ధిక్కార వైఖరికి ఒడిగట్టారు. ప్రతి సముదాయం వారూ తమ ప్రవక్తను పట్టుకోజూశారు.[9] అసత్యంతో సత్యాన్ని దెబ్బ తీసేందుకు పిడివాదనలు చేశారు.[10]

ప్రసాదిస్తాడు, కొందరు దీన్ని అనుగ్రహం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఆయన తన దాసులను అనుగ్రహించేవాడన్న మాట.

7. ఇక్కడ **'వాదులాడటం'** అంటే అధర్మంగా వితండవాదన చేయటం అని అర్థం. సత్యాన్ని ఓడించి అసత్యాన్ని చాటే ఉద్దేశంతో చేసే ఈ వాదులాట ఖండించదగినది. సత్యధర్మ ఉన్నతికోసం, అపార్థాల తొలగింపు కోసం వాదిస్తే తప్పు లేదు. పైగా ఇలాంటి వాదన స్వాగతించదగినది, ప్రశంసించదగినది. ఇలాంటి సంవాదనల కోసం సిద్ధంగా ఉండాలని తాకీదు కూడా చేయటం జరిగింది. ఉదాహరణకు : "మీరు వాటిని ప్రజలకు విడమరచి చెప్పండి, మరుగుపరచకండి" (ఆలి ఇమ్రాన్ – 187). అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథంలోని నిదర్శనాలను, ప్రమాణాలను మరుగు పరచటం ఘోరమైన నేరం. అది ఎంతపెద్ద తప్పంటే దానికి ఒడిగట్టేవారిని లోకంలోని ప్రతి వస్తువూ శపిస్తుంది (అల్ బఖర సూరా 159వ ఆయతు ఆధారంగా).
8. అంటే వర్తకం నిమిత్తం ఈ అవిశ్వాసులు దేశదేశాలలో యథేచ్ఛగా సంచరిస్తున్నారు. వివిధ పట్టణాలలో వ్యాపార లావాదేవీలు జరిపి ఇబ్బడిముబ్బడిగా లాభాలను ఆర్జిస్తున్నారు. అంతమాత్రాన మేము వారిని విడిచిపెట్టేశామని అనుకోరాదు. వారికి కొంతగడువు ఇచ్చిన సంగతి వాస్తవమే. అయితే వారు తమ తిరస్కార వైఖరి మూలంగా అనతి కాలంలోనే దేవుని ఉచ్చులో చిక్కుబడిపోతారు.
9. అంటే ప్రవక్తను కారాగారంలో వేయాలనో, లేక చంపేయాలనో వారు పథకం వేసేవారు.
10. అంటే వారు తమ ప్రవక్తలతో అర్థంపర్థం లేకుండా వాదులాడేవారు. సత్యధర్మంలో ఏదో వంకపెట్టి, దాన్ని అపఖ్యాతిపాలు చేయాలన్నదే వారి మనసులోని ఉద్దేశం.

بِالْبَاطِلِ لِيُدْحِضُوا بِهِ الْحَقَّ فَأَخَذْتُهُمْ فَكَيْفَ كَانَ عِقَابِ ⑤

అందుకే నేను వాళ్ళను పట్టుకున్నాను. మరి నా తరఫున ఎలా దెబ్బ పడిందో (చూడు)![11]

وَكَذَٰلِكَ حَقَّتْ كَلِمَتُ رَبِّكَ عَلَى الَّذِينَ كَفَرُوا أَنَّهُمْ أَصْحَابُ النَّارِ ⑥

**6** ఈ విధంగా – సత్యతిరస్కారులు నరక వాసులవుతారన్న నీ ప్రభువు వాక్కు నిజమని రుజువయింది.[12]

الَّذِينَ يَحْمِلُونَ الْعَرْشَ وَمَنْ حَوْلَهُ يُسَبِّحُونَ بِحَمْدِ رَبِّهِمْ وَيُؤْمِنُونَ بِهِ وَيَسْتَغْفِرُونَ لِلَّذِينَ آمَنُوا رَبَّنَا وَسِعْتَ كُلَّ شَيْءٍ رَّحْمَةً وَعِلْمًا فَاغْفِرْ لِلَّذِينَ تَابُوا وَاتَّبَعُوا سَبِيلَكَ وَقِهِمْ عَذَابَ الْجَحِيمِ ⑦

**7** అర్ష్ (అల్లాహ్ సింహాసనం)ను మోసే వారు, దాని చుట్టూ ఉన్న వారు (దైవ దూతలు) స్తోత్రసమేతంగా తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతున్నారు. వారు ఆయన్ని విశ్వసిస్తున్నారు. విశ్వాసుల మన్నింపు కొరకు ప్రార్థిస్తూ వారు ఇలా అంటారు: "మా ప్రభూ! నీవు ప్రతి వస్తువును నీ దయానుగ్రహంతో, పరిజ్ఞానంతో ఆవరించి ఉన్నావు. కనుక పశ్చాత్తాపం చెంది, నీ మార్గాన్ని అనుసరించినవారిని నీవు క్షమించు. ఇంకా వారిని నరక శిక్ష నుంచి కూడా కాపాడు.[13]

11. అందుకే నేను ఈ అసత్యవాదులపై నా పట్టు బిగించాను. మరి నా పట్టు వారిపై ఎలా బిగిసుకుందో, వారెలా నామరూపాల్లేకుండా పోయారో చూడండి!

12. వెనుకటి జాతులను శిక్షించే విషయంలో నీ ప్రభువు వాక్కు ఎలా రూఢీ అయిందో అలాగే, ఈ మక్కావాసులు గనక తమ మంకుతనాన్ని వీడకపోతే, అర్థంలేని కోతలు కోయటం విడనాడకపోతే వారు కూడా దేవునికి పట్టుబడతారు. అప్పుడు వాళ్ళను ఆదుకునే వాడెవడూ ఉండడు.

13. దైవసింహాసనాన్ని ఎత్తి పట్టుకున్న దైవదూతల గురించి ఇక్కడ ప్రస్తావించబడింది. వారు దైవసామీప్యం పొందినవారై ఉంటారు. అహోరాత్రులు వారు కడు వినమ్రతతో దైవకీర్తన చేస్తూ, దేవుని పవిత్రతను కొనియాడుతూ ఉంటారు. వారు ఒకవైపు దేవుని శక్తిసామర్థ్యాలను ప్రశంసిస్తూనే, మరోవైపు దైవాన్ని విశ్వసించే సమస్త దాసుల మన్నింపు కోసం ప్రార్థిస్తూ ఉంటారు. దైవ సింహాసనాన్ని మోసే దూతల సంఖ్య నాలుగు అనీ, అయితే ప్రళయదినాన వారు ఎనిమిది మంది దాకా ఉంటారని అనబడుతోంది (ఇబ్నె కసీర్).

**8** "మా ప్రభూ! నువ్వు వారికి వాగ్దానం చేసివున్న శాశ్వితమైన స్వర్గవనాలలో వారికి ప్రవేశం కల్పించు. మరి వారి పితామహులలోని, సతీమణులలోని, సంతానంలోని సజ్జనులకు కూడా[14] (స్వర్గంలో స్థానం కల్పించు). నిశ్చయంగా నీవు సర్వసత్తాధికారివి, వివేక సంపన్నుడివి.

رَبَّنَا وَأَدْخِلْهُمْ جَنّٰتِ عَدْنِ الَّتِي وَعَدْتَّهُمْ وَمَنْ صَلَحَ
مِنْ اٰبَآئِهِمْ وَأَزْوَاجِهِمْ وَذُرِّيّٰتِهِمْ ۚ إِنَّكَ أَنْتَ الْعَزِيزُ
الْحَكِيمُ ﴿٨﴾

**9** "వారిని చెడుల నుండి కూడా కాపాడు.[15] యదార్థమేమిటంటే ఆనాడు నీవు చెడుల నుంచి కాపాడిన వారిపై నీవు (అమితంగా) దయ జూపినట్లే. గొప్ప సాఫల్యం అంటే అదే!"[16]

وَقِهِمُ السَّيِّاٰتِ ۚ وَمَنْ تَقِ السَّيِّاٰتِ يَوْمَئِذٍ
فَقَدْ رَحِمْتَهُ ۚ وَذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيمُ ﴿٩﴾

14. వారు ఒకరినొకరు చూసుకుని సంతోషంతో పొంగిపోయేలా వారందరికీ స్వర్గంలో చోటు కల్పించు. ఆ మాటే వేరొక చోట మరోవిధంగా - ఇలా - చెప్పబడింది : "విశ్వాసుల సంతానం గనక - విశ్వాసం విషయంలో - వారిని అనుసరించి ఉంటే వారి సంతానాన్ని కూడా మేము వారితో కలుపుతాము. వారి కర్మలలో మేము ఎలాంటి కోత విధించము" (అత్ తూర్ - 21). అంటే స్వర్గంలో అందరికీ సమానస్థాయిని ప్రసాదిస్తాము. అయితే దిగువస్థాయి వారితో సమానంగా ఉంచే నెపంతో ఉన్నత శ్రేణికి చెందినవారిని క్రిందికి తీసుకురావటం మాత్రం జరగదు. కాని క్రింది తరగతి వారిని మాత్రం ఉన్నతశ్రేణికి చేర్చటం జరుగుతుంది. అంటే వారి కర్మలలో ఉన్న వెలితిని కూడా మేము మా దయా దాక్షిణ్యాలతో భర్తీ చేసేస్తాము.

15. చెడుల నుంచి కాపాడటం అంటే ఇక్కడ భావం వారి దుష్కర్మల దుష్పరిణామాల నుండి కాపాడటం అని.

16. అంటే పరలోక శిక్ష నుండి కాపాడబడటం, స్వర్గంలో ప్రవేశం కల్పించటం - ఇదే అతి గొప్ప సాఫల్యం! ఎందుకంటే ఇంతకుమించిన విజయంగానీ, మోక్షంగానీ మరేదీ లేదు. ఈ ఆయతులలో విశ్వాసుల కొరకు రెండు గొప్ప శుభవార్తలున్నాయి - 1. వారి పరోక్షంలో వారి మన్నింపు కోసం దైవదూతలు ప్రార్థిస్తారు. (ఈ విధమైన పరోక్ష ప్రార్థన ఎంతో శ్రేష్ఠమైనదని హదీసుల్లో సైతం చెప్పబడింది). 2. విశ్వాసుల కుటుంబీకులు స్వర్గంలో ఏకమవుతారు. అల్లాహుతాలా మనందరికీ ఆ సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక!

إِنَّ الَّذِيْنَ كَفَرُوْا يُنَادَوْنَ لَمَقْتُ اللّٰهِ أَكْبَرُ مِنْ
مَّقْتِكُمْ أَنْفُسَكُمْ إِذْ تُدْعَوْنَ إِلَى الْإِيْمَانِ
فَتَكْفُرُوْنَ ﴿١٠﴾

**10** తిరస్కార వైఖరిని అవలంబించిన వారిని పిలిచి ఇలా అనబడుతుంది : "మీపై మీకు ఎంత కోపం వస్తుందో, అంతకంటే ఎక్కువగానే అల్లాహ్‌కు మీపై కోపం వచ్చేది – మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలిచినపుడు, మీరేమో అవిశ్వాసానికి ఒడిగట్టేవారు."[17]

قَالُوْا رَبَّنَا أَمَتَّنَا اثْنَتَيْنِ وَأَحْيَيْتَنَا اثْنَتَيْنِ فَاعْتَرَفْنَا
بِذُنُوْبِنَا فَهَلْ إِلٰى خُرُوْجٍ مِّنْ سَبِيْلٍ ﴿١١﴾

**11** (అప్పుడు వారు) "మా ప్రభూ! నీవు రెండుసార్లు మాకు చావునిచ్చావు. రెండు సార్లు బ్రతికించావు.[18] ఇప్పుడు మేము మా పాపాలను ఒప్పుకుంటున్నాము.[19] మరి ఇప్పుడు బయటపడే మార్గం ఏదన్నా ఉందా?"[20] అని విన్నవించుకుంటారు.

17. **'మఖ్తున్'** అంటే తీవ్రమైన అయిష్టత, అసహ్యాభావం అనే అర్థాలు వస్తాయి. అవిశ్వాసులు అగ్నికి ఆహుతి అయి, మాడి పోతున్నప్పుడు వారికి వారిపైనే అసహ్యం కలుగుతుంది. అప్పుడు వారినుద్దేశించి, ఒకప్పుడు – ఇహలోకంలో – మిమ్మల్ని 'విశ్వాసం' వైపుకు ఆహ్వానించినపుడు మీరు విముఖత చూపేవారే, అప్పుడు అల్లాహ్‌కు మీపై ఇంతకన్నా ఎక్కువ అసహ్యమే కలిగేది. ఆ అయిష్టత మూలంగానే నేడు మీకు ఈ దురవస్థ దాపురించింది.

18. చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం రెండు మరణాలలో మొదటి మరణావస్థ తండ్రి వెన్నులో వీర్యం రూపంలో ఉంటుంది. అంటే ఆ వీర్యం ఉనికిలోకి రాకపూర్వం ఉన్న స్థితిని మరణావస్థగానే పేర్కొనటం జరిగింది. రెండవసారి మరణం మనిషి జీవించిన తరువాత వస్తుంది. ఆ తరువాత అతను ఖననం చేయబడతాడు. ఇక రెండు జీవితాలలో మొదటి జీవితం ఈ ప్రాపంచిక జీవితం. మనిషి పుట్టుక నాటి నుంచి చనిపోయేవరకు ఈ జీవితం ఉంటుంది. రెండవ జీవితం ప్రళయదినాన సమాధుల నుంచి లేచాక ప్రాప్తిస్తుంది. ఈ రెండు జీవితాల, రెండు మరణాల ప్రస్తావన అల్ బఖర సూరాలో ఈ విధంగా ప్రస్తావించబడింది : "యదార్థానికి ప్రాణంలేని మీకు ఆయన ప్రాణం పోశాడు. మళ్లీ మీ ప్రాణాన్ని తీసేది కూడా ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేది కూడా ఆయనే." (28)

19. వారు నరకాగ్నికి ఆహుతి అయిన పిదప తమ తప్పును ఒప్పుకుంటారు. కాని అక్కడ తప్పును ఒప్పుకునిగానీ, పశ్చాత్తాపం చెందిగానీ ప్రయోజనం ఏమీ ఉండదు.

20. మరోసారి ప్రపంచంలోకి పంపిస్తే మంచి పనులు చేసివస్తామని వారు ఆశగా

12 (సమాధానంగా ఇలా అనబడుతుంది) "మీకు ఈ దుర్గతి ఎందుకు పట్టిందంటే, ఒక్కడైన అల్లాహ్‌ను గురించి ప్రస్తావించ బడినపుడు మీరు త్రోసిపుచ్చేవారు. మరి అదే ఆయనకు ఎవరినయినా సహవర్తుల్ని కల్పించినపుడు (సంతోషంగా) అంగీక రించేవారు.[21] కాబట్టి ఇప్పుడు (అంతిమ) నిర్ణయాధికారం సర్వోన్నతుడు, గొప్పవాడు అయిన అల్లాహ్‌దే."[22]

ذَٰلِكُم بِأَنَّهُۥٓ إِذَا دُعِيَ ٱللَّهُ وَحۡدَهُۥ كَفَرۡتُمۡ وَإِن يُشۡرَكۡ بِهِۦ
تُؤۡمِنُواْۚ فَٱلۡحُكۡمُ لِلَّهِ ٱلۡعَلِيِّ ٱلۡكَبِيرِ ١٢

13 ఆయనే తన సూచనలను మీకు చూపిస్తున్నాడు. మీ కోసం ఆకాశం నుంచి ఉపాధిని కురిపిస్తున్నాడు.[23] (అల్లాహ్ వైపునకు) మరలేవారు మాత్రమే దీన్నుండి హితబోధను గ్రహిస్తారు.[24]

هُوَ ٱلَّذِي يُرِيكُمۡ ءَايَٰتِهِۦ وَيُنَزِّلُ لَكُم مِّنَ ٱلسَّمَآءِ رِزۡقٗاۚ
وَمَا يَتَذَكَّرُ إِلَّا مَن يُنِيبُ ١٣

అడుగుతారు. వారి కోరిక ఖుర్ఆన్‌లో చాలా చోట్ల ప్రస్తావనకు వచ్చింది. కాని వారి కోరిక తీరదు.

21. నరకం నుంచి వారికి విముక్తి ఎందుకు లభించదో ఇక్కడ తెలుపబడింది. మీరు ప్రపంచంలో దేవుని ఏకత్వాన్ని కొట్టిపారేసి, షిర్క్ (బహుదైవారాధన)ను ఇష్టడేవారు. కాబట్టి మీ షిర్క్‌కు పర్యవసానంగా శాశ్వితమైన నరకశిక్షను రుచిచూస్తూ ఉండండి.

22. ఇకనుంచి మీరు నరక శిక్షను అనుభవిస్తూ ఉండాలన్న నిర్ణయం ఎవరిదో కాదు, ఒక్కడైన ఆ అల్లాహ్‌దే. ఆనాడు మీరు ఆయన గురించి కల్పిస్తూ ఉండే కల్లబొల్లి కబుర్లకు ఆయన అతీతుడు, సర్వోన్నతుడు, సర్వాధికుడు.

23. మనిషి జీవనావసరాలలో అత్యంత ముఖ్యమైనది నీరు. అల్లాహ్ ఆకాశం నుంచి వర్షపు నీరును కురిపించి, ప్రాణులకు త్రాగునీరును సమకూర్చటమేగాకుండా, ఆ నీటితో రకరకాల ఆహార ధాన్యాలను, పండ్లు ఫలాలను పండిస్తున్నాడు. ఇది దైవసూచనలలో ఒకటి. గుణపాఠం నేర్చుకోదలిచే వారికి ఇందులో గొప్ప గుణపాఠం ఉంది.

ఈ ఆయతులో రెండు విషయాల్ని – సూచనలను చూపించటాన్ని, ఉపాధిని కురిపిం చటాన్ని – రెండింటి గురించి ఒకే ఆయతులో వివరించటం గమనార్హం. ఆయతులు (సూచనలు) అల్లాహ్ శక్తిసామర్థ్యాలను బహిర్గతం చేస్తాయి. ఈ విధంగా ఆయతులు

**14** కాబట్టి మీరు మీ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకుని ఆయన్నే వేడుకుంటూ ఉండండి – అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే![25]

فَادْعُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ وَلَوْ كَرِهَ الْكٰفِرُوْنَ ﴿١٤﴾

**15** ఆయన ఉన్నత శ్రేణులు కలవాడు, అర్ష్‌కు (సింహాసనానికి) అధిపతి. ఆయన తన దాసులలో తాను కోరినవారిపై తన సందేశాన్ని (వహీని) అవతరింపజేస్తాడు[26] –సమావేశం కానున్న ఆ దినం గురించి అతడు (ప్రవక్త) భయపెట్టడానికి!

رَفِيْعُ الدَّرَجٰتِ ذُو الْعَرْشِ ۚ يُلْقِي الرُّوْحَ مِنْ اَمْرِهٖ
عَلٰى مَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ لِيُنْذِرَ يَوْمَ التَّلَاقِ ﴿١٥﴾

**16** ఆ రోజున అందరూ బయల్పడతారు.[27] అప్పుడు వారి(లోగుట్టు) విషయమేదీ అల్లాహ్ నుండి దాగి ఉండదు. ఈ రోజు విశ్వసార్వభౌమత్వం ఎవరిది?[28] ఒక్కడైన, తిరుగులేనివాడైన అల్లాహ్‌ది మాత్రమే.[29]

يَوْمَ هُمْ بٰرِزُوْنَ ۚ لَا يَخْفٰى عَلَى اللّٰهِ مِنْهُمْ شَيْءٌ ۭ لِمَنِ
الْمُلْكُ الْيَوْمَ ۭ لِلّٰهِ الْوَاحِدِ الْقَهَّارِ ﴿١٦﴾

ధర్మానికి పునాదుల వంటివి. మరోవైపు ఉపాధి దేహాలకు పునాది అవుతుంది. ఇక్కడ ఈ రెండు పునాదులనూ కలిపి చెప్పటం విశేషం (ఫత్‌హుల్ ఖదీర్).

24. మరలేవారు అంటే దైవవిధేయత వైపుకు మరలేవారు అని భావం. ఈ సూచనల ద్వారా వారిలో దైవభీతి, పరలోక భీతి జనిస్తుంది. దాంతో వారు దైవాజ్ఞలకు కట్టుబడి జీవిస్తారు.

25. అన్నీ చక్కబెట్టేవాడు అల్లాహ్‌యే అయినప్పుడు మీరు ఆ ఒక్క దైవాన్నే ప్రార్థించాలి. ఆయన ముందరే తలవంచాలి. మీ ఉపాసనలన్నింటినీ ఆయనకే ప్రత్యేకించాలి. మీ చర్య అవిశ్వాసులకు సహించకపోయినా మీరు లెక్క చేయకూడదు.

26. ఈ ఆయతులో **'రూహున్'** అంటే దైవసందేశం (వహీ) అని అర్థం. దేవుడు తన దాసులలో ఎవరినయినాసరే ఎన్నుకుని, వారికి తన సందేశాన్ని అందజేస్తాడు. దైవసందేశాన్ని 'రూహ్'గా అభివర్ణించటంలోని మర్మం ఏమిటంటే, ఏ విధంగానయితే రూహ్ (ఆత్మ లేక ప్రాణం) ద్వారా మనిషి సజీవంగా, సచేతనంగా ఉంటాడో అదేవిధంగా దైవసందేశం (వహీ) వల్ల మానవ హృదయాలలో జీవం ఉట్టిపడుతూ ఉంటుంది. అంతకు మునుపు అవి కుఫ్ర్, షిర్క్‌ల మూలంగా నిర్జీవంగా ఉండేవి.

27. అంటే వారు బ్రతికి సమాధులలో నుంచి లేచి వచ్చినప్పుడు....

**17** ఈ రోజు ప్రతి ప్రాణికీ అది సంపాదించిన దాని ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఈ రోజు (ఎవరికీ, ఎలాంటి) అన్యాయం జరగదు. నిశ్చయంగా అల్లాహ్ బహు శీఘ్రంగా లెక్కతేల్చేవాడు.[30]

اَلْيَوْمَ تُجْزٰى كُلُّ نَفْسٍۭ بِمَا كَسَبَتْ ؕ لَا ظُلْمَ الْيَوْمَ ؕ اِنَّ اللّٰهَ سَرِيْعُ الْحِسَابِ ﴿١٧﴾

**18** (ఓ ప్రవక్తా!) చాలా దగ్గరలోనే ఉన్న[31] ఆ దినం గురించి వారిని హెచ్చరించు. అప్పుడు వారి గుండెలు గొంతుల దాకా వచ్చేస్తాయి. వారంతా గమ్మున (బాధను) దిగమ్రింగుతూ ఉంటారు.[32] (ఆ రోజు) దుర్మార్గులను ఆదుకునే ఆప్తమిత్రుడు గానీ, మాట చెలామణీ చేసుకోగల సిఫారసు చేసేవాడుగానీ ఎవడూ ఉండడు.

وَاَنْذِرْهُمْ يَوْمَ الْاٰزِفَةِ اِذِ الْقُلُوْبُ لَدَى الْحَنَاجِرِ كٰظِمِيْنَ ؕ مَا لِلظّٰلِمِيْنَ مِنْ حَمِيْمٍ وَّلَا شَفِيْعٍ يُّطَاعُ ﴿١٨﴾

28. అంటే ప్రళయదినాన మనుషులంతా సమాధులలోనుంచి లేచి, మహ్షర్ మైదానంలోకి వచ్చినప్పుడు అల్లాహ్ ఈ విధంగా ప్రశ్నిస్తాడు. ఆయన భూమిని గుప్పెట్లో, ఆకాశాలను తన కుడిచేతిలో చుట్టిపట్టుకుని, "నేనే విశ్వచక్రవర్తిని. భూమండలంలోని చక్రవర్తులు ఎక్కడున్నారు?" అని అడుగుతాడు. (సహీహ్ బుఖారీ, అజ్జుమర్ సూరా వ్యాఖ్యానం).

29. ఎవరూ మాట్లాడలేకపోయేసరికి అల్లాహ్ స్వయంగా ఇలా సమాధానమిస్తాడు. అల్లాహ్ ఆజ్ఞపై ఒక దైవదూత ఇలా ప్రకటిస్తాడని, దాంతో అవిశ్వాసులు, విశ్వాసులు–అందరూ ముక్తకంఠంతో ఇదే సమాధానమిస్తారని మరికొందరు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

30. ఎందుకంటే మానవుల మాదిరిగా ఆలోచిస్తూ ఉండవలసిన అవసరం ఆయనకు లేదు.

31. **'ఆజిఫతు'** (اٰلْاٰزِفَةِ) అంటే సమీపంలోనే వచ్చేది అని అర్థం. ప్రళయదినానికి గల పేర్లలో ఇదొకటి.

32. అంటే, ఆనాడు భయము, కలవరం మూలంగా హృదయాలు ఉన్న చోటినుంచి తొలగిపోతాయి. **'కాజిమీన్'** (كٰظِمِيْنَ) అంటే దుఃఖంతో నిండినవి, లేక విలపించేవి లేక గమ్మున ఉండిపోయేవి అన్న అర్థాలు వస్తాయి.

يَعْلَمُ خَآئِنَةَ الْاَعْيُنِ وَمَا تُخْفِى الصُّدُوْرُ ﴿١٩﴾

19 ఆయన కళ్లల్లోని మోసాన్ని, గుండె ల్లోని గుట్టును సయితం (బాగా) ఎరిగిన వాడు.[33]

وَاللّٰهُ يَقْضِىْ بِالْحَقِّ ؕ وَالَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِهٖ لَا يَقْضُوْنَ بِشَىْءٍ ؕ اِنَّ اللّٰهَ هُوَ السَّمِيْعُ الْبَصِيْرُ ﴿٢٠﴾

20 అల్లాహ్ ఖచ్చితంగా న్యాయంగా తీర్పు చేస్తాడు. మరి అల్లాహ్‌ను వదలి వారు ఎవరెవరిని మొరపెట్టుకునేవారో వారు ఏ విషయంలోనూ తీర్పు చేయ లేరు.[34] నిశ్చయంగా అల్లాహ్ అంతా వినే వాడు, అంతా చూసేవాడు.

اَوَلَمْ يَسِيْرُوْا فِى الْاَرْضِ فَيَنْظُرُوْا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِيْنَ كَانُوْا مِنْ قَبْلِهِمْ ؕ كَانُوْا هُمْ اَشَدَّ مِنْهُمْ قُوَّةً

21 ఏమిటి, వారు భూమిపై సంచరించి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో చూడలేదా? బలపరాక్రమాల రీత్యాగానీ, భూమిపై వదలి వెళ్ళిన చిహ్నాల దృష్ట్యాగానీ వారు వీరికన్నా గట్టివారే. మరి

33. ఈ ఆయతులో దేవుని సంపూర్ణ జ్ఞానం గురించి చెప్పబడింది. ఆయన ప్రతి వస్తువును – అది బహిర్గతమైనదైనా, గోప్యమైనదైనా, పెద్దదైనా, సూక్ష్మాతిసూక్ష్మమైనదైనా, అల్పమైనదైనా, గొప్పదైనా – గమనిస్తూ ఉన్నాడు. ఆయన జ్ఞానపరిధి అంత విస్తృతమైనదని తెలిసినప్పుడు మానవుడు సర్వకాల సర్వావస్థల్లో ఆయన అవిధేయతకు దూరంగా ఉండాలి. నిజభావంలో ఆయనకు భయపడాలి. కళ్లతో కవ్వించటం, దొంగచూపులు చూడటం, దురాలోచనతో దృష్టిని సారించటం చెడు లక్షణం. చెడు చూపు ఎన్నో చెడులకు దారితీస్తుంది. ఉదాహరణకు: పరాయి స్త్రీని దురుద్దేశంతో చూడటం మనసును కలుషితం చేస్తుంది. అంతర్యాన్ని నిర్మలంగా ఉంచుకోవాలి. అంతర్యంలో దుష్ప్రేరణలు జనించటం విపరీతం కాదు. ఆ దుష్ప్రేరణలకు మనిషి ప్రభావితుడు కాకుండా ఉన్నంతవరకూ, దురాచరణకు ఒడిగట్టకుండా ఉన్నంతవరకూ అతడు దోషి కాడు. ఒకవేళ అతడు ఆ దురాలోచనలకు కార్యరూపం ఇస్తే మటుకు అతడు దోషిగా పరిగణించబడతాడు, అల్లాహ్ సన్నిధిలో పట్టుబడతాడు.

34. ఎందుకంటే ఆ మిథ్యా దైవాలకు ఏమీ తెలియదు. వాటికి దేనిపైనా అధికారం లేదు. కాగా; ఏదేని విషయంపై తీర్పు చేయాలంటే విషయ జ్ఞానంతోపాటు, అధికారం కూడా కావాలి. ఈ రెండు సుగుణాలు అల్లాహ్‌కు మాత్రమే స్వంతం. అందువల్ల న్యాయనిర్ణయం గైకొనే హక్కు ఆయనకే ఉండాలి. నిశ్చయంగా ఆయన న్యాయబద్ధంగా

అల్లాహ్ వారి దురాగతాల కారణంగా వారిని పట్టుకున్నాడు. మరి అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారిని ఆదుకునేవాడెవడూ లేకపోయాడు.[35]

وَّاٰثَارًا فِى الْاَرْضِ فَاَخَذَهُمُ اللّٰهُ بِذُنُوْبِهِمْ ؕ وَمَا كَانَ لَهُمْ مِّنَ اللّٰهِ مِنْ وَّاقٍ ﴿٢١﴾

**22** వారికీ దుర్గతి పట్టటానికి కారణ మేమిటంటే, వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన సూచనలను తీసుకువచ్చేవారు. కాని వారు మాత్రం వాటిని త్రోసిపుచ్చే వారు.[36] అందుకే అల్లాహ్ వారిని పట్టు కున్నాడు. నిస్సందేహంగా ఆయన బలాఢ్యుడు. కఠినంగా శిక్షించేవాడు.

ذٰلِكَ بِاَنَّهُمْ كَانَتْ تَّاْتِيْهِمْ رُسُلُهُمْ بِالْبَيِّنٰتِ فَكَفَرُوْا فَاَخَذَهُمُ اللّٰهُ ؕ اِنَّهٗ قَوِىٌّ شَدِيْدُ الْعِقَابِ ﴿٢٢﴾

**23** మేము మూసా (అలైహిస్సలాం) కు మా నిదర్శనాలను, తిరుగులేని ప్రమాణాన్ని ఇచ్చి పంపాము[37] –

وَلَقَدْ اَرْسَلْنَا مُوْسٰى بِاٰيٰتِنَا وَسُلْطٰنٍ مُّبِيْنٍ ﴿٢٣﴾

తీర్పు ఇస్తాడు. ఎందుకంటే ఆయన ఎవరికీ లోబడినవాడు కాదు, ఆయనకు ఎవరి భయమూ లేదు.

35. ఇంతకు ముందు ఆయతులలో పరలోక స్థితిగతులు వివరించబడినాయి. ఈ ఆయతు లలో ప్రాపంచిక పరిణామాల ద్వారా వీరిని హెచ్చరించటం జరుగుతోంది. మీ పూర్వీకులకు పట్టిన గతేమిటో, మీరు దేశంలో తిరిగి చూడటం లేదా? తమ తలబిరుసు తనం మూలంగానూ, తిరస్కార వైఖరి కారణంగానూ వారు సమూలంగా పెకలించి వేయబడ్డారు. మరి చూడబోతే వారు మీకన్నా బలవంతులే. మీకన్నా గొప్ప కట్టడాలను, జాతీయచిహ్నాలను రాజ్యంలో వదలిపోయారు. కాని తీరా దైవశిక్ష వచ్చాక వారిని ఎవరూ ఆదుకోలేకపోయారు. వారి మాదిరిగానే మీక్కూడా అదే దుర్గతి పట్టవచ్చు. ఒకవేళ అదేగనక జరిగితే మీకు అండగా ఎవరూ ఉండరు సుమా!

36. వారిని అంతమొందించటానికి గల అసలు కారణమేమిటంటే వారు దేవుని నిదర్శనా లను లక్ష్యపెట్టేవారు కాదు, మరోవైపు దైవప్రవక్తలను కూడా పరిహసించే వారు. ఇప్పుడు దైవదౌత్య పరంపర ఆగిపోయినప్పటికీ విశ్వమండలంలో అసంఖ్యాకమైన దైవసూచనలు వ్యాపించి ఉన్నాయి. అదీగాక బోధనల ద్వారా, ప్రసంగాల ద్వారా, ఇష్టాగోష్ఠుల ద్వారా సత్యధర్మ సందేశాన్ని అందజేసే పండితులు ఉన్నారు. ప్రచార ప్రసార సాధనాలున్నాయి. అందువల్ల ఈనాడైనాసరే దైవనిదర్శనాల పట్ల విముఖత

إِلَىٰ فِرْعَوْنَ وَهَامَانَ وَقَارُونَ فَقَالُوا سَاحِرٌ كَذَّابٌ ﴿٢٤﴾

**24** ఫిరౌను, హామాను, ఖారూను వద్దకు (పంపాము). కాని వారేమో, "ఇతను మాంత్రికుడు, అబద్ధాలకోరు"[38] అని అన్నారు.

فَلَمَّا جَاءَهُم بِالْحَقِّ مِنْ عِندِنَا قَالُوا اقْتُلُوا أَبْنَاءَ الَّذِينَ آمَنُوا مَعَهُ وَاسْتَحْيُوا نِسَاءَهُمْ ۚ وَمَا كَيْدُ الْكَافِرِينَ إِلَّا فِي ضَلَالٍ ﴿٢٥﴾

**25** మరి అతను (మూసా) వారి వద్దకు మా తరఫు నుంచి సత్యాన్ని తీసుకుని వచ్చినప్పుడు, "అతని పంచనచేరి విశ్వ సించిన వారి కొడుకులను చంపేయండి, వారి ఆడవాళ్ళను మాత్రం బ్రతక నివ్వండి"[39] అని వారు పలికారు. కాని అవిశ్వాసుల ఎత్తుగడలన్నీ భ్రష్టమైనవి.[40]

---

చూపి, దేవుని శాసనాంగం (షరీయతు) పట్ల అశ్రద్ధను, ఏమరుపాటును ప్రదర్శించిన వారి పరిణామం కూడా ధిక్కారులైన తమ పూర్వీకులకంటే భిన్నంగా ఏమీ ఉండదు.

37. ఇక్కడ **'నిదర్శనాలు'** అంటే ఇంతకుముందు పేర్కొనబడిన తొమ్మిది నిదర్శనాలూ కావచ్చు లేక చేతికర్ర పాముగా మారటం, చంకలో పెట్టిన చేయి ధగధగా మెరిసి పోవటం కూడా కావచ్చు. 'తిరుగులేని ప్రమాణం' అంటే మూసా చూపించిన నిదర్శనా లకు అవిశ్వాసుల వద్ద సరైన సమాధానం లేకపోవటం అన్నమాట! కాకపోతే వారు నిస్సిగ్గుగా డొంకతిరుగుడు మాటలు చెప్పి, తమ జాతి ప్రజలను ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు.

38. ఫిరౌన్ ఈజిప్టు రాజ్యంలో ఖిబ్తీల పరిపాలకునిగా ఉండేవాడు. పరమదుర్మార్గుడు, కఠినాత్ముడు. తన నిరంకుశ చర్యలతో అమాయక జనుల నోళ్లు మూయించి, తనే అందరికీ సిసలైన ప్రభువునని ప్రకటించుకున్నాడు. దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) జాతివారైన ఇస్రాయీలీయులను వాడు బానిసలుగా చేసుకున్నాడు. వారిని శతవిధాలుగా వేధించేవాడు. వాడి ఏలుబడిలో ఇస్రాయీలీయులు పడిన కష్టాలను గురించి దివ్య ఖుర్ఆన్ అనేకచోట్ల వివరించింది. హామాను కూడా దుర్మార్గుడే. వాడు ఫిరౌన్ చక్రవర్తికి ప్రధాన సలహాదారుగా ఉండేవాడు. ఖారూన్ ఆ కాలంలో అతిపెద్ద శ్రీమంతుడు. వారంతా – పూర్వీకుల మాదిరిగానే – హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను ధిక్కరించారు. ధిక్కరించటమే కాదు, అతన్ని ఒక తాంత్రికునిగా, అబద్ధాగ్రేసరునిగా చిత్రీకరించి ప్రజా బాహుళ్యంలో అతనికి చోటులేకుండా చేయాలని పన్నాగాలు పన్నారు. ఈ విషయమే దివ్య ఖుర్ఆన్‌లో వేరొకచోట ఇలా చెప్పబడింది: "ఇంతకు ముందు గతించిన వారి విషయంలో కూడా ఇలాగే జరిగింది. వారివద్దకు ఏ ప్రవక్త వచ్చినా, 'ఇతను మాంత్రికుడైనా అయి

**26** ఫిరౌన్ ఇలా అన్నాడు : "నన్ను వదలండి. నేను మూసాను చంపేస్తాను.[41] అతడు తన ప్రభువును పిలుచుకోనివ్వండి.[42] ఇతడు మీ మతాన్ని ఎక్కడ మార్చివేస్తాడో లేక రాజ్యంలో (చాలా పెద్ద) అరాచకాన్ని ఎక్కడ సృష్టిస్తాడోనని నేను భయపడుతున్నాను."[43]

وَقَالَ فِرْعَوْنُ ذَرُوْنِيْٓ اَقْتُلْ مُوْسٰى وَلْيَدْعُ رَبَّهٗ ۚ اِنِّيْٓ اَخَافُ اَنْ يُّبَدِّلَ دِيْنَكُمْ اَوْ اَنْ يُّظْهِرَ فِي الْاَرْضِ الْفَسَادَ ﴿٢٦﴾

వుండాలి. లేదంటే పిచ్చివాడైనా అయివుండాలి' అని ఎద్దేవా చేసేవారు. ఏమిటి, ఈ విషయం గురించి వారు ఒండొకరికి తాకీదు చేసుకుంటూపోయారా? కాదు, అసలు వారంతా హద్దు మీరినవారు." (అజ్జారియాత్ – 52, 53).

39. ఫిరౌన్ చాలాకాలంగా ఈ అమానుషానికి పాల్పడేవాడు. ఎందుకంటే తన రాజ్యంలో పుట్టబోయే ఒక మగపిల్లవాడు అతని రాజ్యాధికారానికి ముప్పుగా మారనున్నాడని జ్యోతిష్యులు అతన్ని హెచ్చరించి ఉన్నారు. ఇప్పుడు మూసా (అలైహిస్సలాం) నిజదైవం వైపుకు ఆహ్వానించటంతో, రెచ్చిపోయి ఆ కిరాతక శాసనాన్ని మరోసారి అమలు పరిచాడు. ఈ చట్టం ద్వారా ఇస్రాయీల్ సంతతిలోని మగ సంతతిని సమూలంగా తుడిచిపెట్టాలన్నది అతని ఎత్తుగడ. దాంతోపాటు ఇస్రాయీలీయులు మూసాను అసహ్యించుకుని, ప్రజా జీవితాలనుంచి మూసాను వెలివేయాలి. నిరంతరం కష్టాలు వచ్చిపడితే మూసాను అతని జాతివారే ఛీత్కరించుకుంటారు. ఆ మాటే వారు ఒకసారి అన్నారు కూడా – "(ఓ మూసా!) నీవు రాక పూర్వం కూడా మేము వేధించబడేవారం. నీవు వచ్చిన తరువాత కూడా మా పరిస్థితి అలాగే ఉంది" (అల్ ఆరాఫ్ – 129).

40. కాని ఫిరౌన్ పాచికలేవీ పారలేదు. బనీ ఇస్రాయీల్‌ను దారుణంగా అణచివేయాలని, తన అధికారాన్ని తిరుగులేనిదిగా నిరూపించుకోవాలని వాడు తలపోశాడు. కాని వాడి ఆశ అడియాసే అయింది. పైగా అల్లాహ్ ఫిరౌన్ జనులను సముద్రంలో ముంచేసి, ఇస్రాయీల్ సంతతిని శుభప్రదమైన భూభాగానికి వారసులుగా చేశాడు.

41. మూసా (అలైహిస్సలాం)ను హతమార్చాలన్న ప్రతిపాదనతో ఏకీభవించని సలహాదారులను ఉద్దేశించి ఫిరౌన్ బహుశా ఇలా అని ఉంటాడు.

42. ఇది ఫిరౌన్‌లోని దుస్సాహసానికి, పొగరుకు మరో ప్రతీక. ఏ ప్రభువు వచ్చి మూసాను కాపాడుతాడో చూద్దాం అన్న వ్యంగ్య ధోరణి కూడా అతని మాటల్లో వ్యక్తమవుతూ ఉంది. ఎందుకంటే 'నేనే అందరికీ గొప్ప ప్రభువును' అని వాడు అంతకుముందే ప్రకటించుకున్నాడు.

43. అంటే మీకిష్టమైన ఎంతోమంది దేవతల నుంచి మిమ్మల్ని తొలగించి ఒకే దేవుని మార్గంపై మిమ్మల్ని నడిపిస్తాడు. లేదా ఇతను దేశంలో కల్లోలాన్ని రేకెత్తిస్తాడు. అంటే

**27** దానికి మూసా, "లెక్కల దినాన్ని విశ్వసించని ప్రతి దురహంకారి (కీడు) నుంచి రక్షణకై నేను నా ప్రభువును, మీ ప్రభువును వేడుకుంటున్నాను" అన్నాడు.[44]

وَقَالَ مُوسَىٰٓ إِنِّى عُذْتُ بِرَبِّى وَرَبِّكُم مِّن كُلِّ مُتَكَبِّرٍ لَّا يُؤْمِنُ بِيَوْمِ الْحِسَابِ ﴿٢٧﴾

**28** (అప్పటి వరకూ) తన విశ్వాసాన్ని గోప్యంగా ఉంచిన, ఫిరౌన్ వంశానికి చెందిన విశ్వాసి అయిన ఒక పురుషుడు ఇలా అన్నాడు: "ఏమిటీ, 'అల్లాహ్ నా ప్రభువు' అని అన్నంత మాత్రానికే ఒక వ్యక్తిని మీరు చంపేస్తారా? నిజానికి అతడు మీ ప్రభువు తరఫు నుంచి స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చాడు.[45] ఒకవేళ అతను చెప్పేది అబద్ధమైతే అతని అబద్ధం (పాపఫలం) అతని మీదే పడుతుంది. మరి అతను గనక తన వాదనలో సత్యవంతుడైతే, అతను మీకు చేసే వాగ్దానం (శిక్ష)లో ఎంతో కొంత మీపై కూడా వచ్చి పడుతుంది.[46] బరితెగించిపోయే వాడికి,

وَقَالَ رَجُلٌ مُّؤْمِنٌ مِّنْ اٰلِ فِرْعَوْنَ يَكْتُمُ اِيْمَانَهٗٓ اَتَقْتُلُوْنَ رَجُلًا اَنْ يَّقُوْلَ رَبِّيَ اللّٰهُ وَقَدْ جَآءَكُمْ بِالْبَيِّنٰتِ مِنْ رَّبِّكُمْ ؕ وَاِنْ يَّكُ كَاذِبًا فَعَلَيْهِ كَذِبُهٗ ۚ وَاِنْ يَّكُ صَادِقًا يُّصِبْكُمْ بَعْضُ الَّذِيْ يَعِدُكُمْ ؕ اِنَّ اللّٰهَ لَا يَهْدِيْ مَنْ هُوَ مُسْرِفٌ كَذَّابٌ ﴿٢٨﴾

---

తన రాజ్యంలోని కొంతమంది ప్రజలు గనక మూసా మాటను విని అతను ప్రబోధించే మతాన్ని స్వీకరించినట్లయితే, స్వీకరించని వారితో వారు గొడవపడతారు. తత్ఫలితంగా సంఘర్షణ మొదలవుతుంది. సంక్షోభం పుట్టుకొస్తుంది. అంటే ఏకదైవారాధనా సందేశాన్ని ఫిరౌన్ కలహకారకంగా తలపోశాడు. ఏక దైవారాధకులను కల్లోల జనకులుగా ఖరారు చేశాడు. మరి చూడబోతే అందరికన్నా పెద్ద కల్లోల జనకుడుగా అతను స్వయంగా ప్రవర్తించేవాడు. వాస్తవానికి దైవేతరుల దాస్యమే కల్లోలానికి మూలం.

44. ఫిరౌన్ తనను చంపే యత్నంలో ఉన్నాడని పసిగట్టగానే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ఆ అధికారమదాంధుని కీడునుంచి అల్లాహ్ శరణు కోరారు. శత్రువు నుంచి ప్రమాదం పొంచి వున్నప్పుడు అంతిమ దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా వేడుకునేవారు : **"అల్లాహుమ్మ! ఇన్నా నజ్అలుక ఫీ నుహూరిహిమ్ వ నవూజుబిక మిన్ షురూరిహిమ్"** (ముస్నదె అహ్మద్ – 4/415). (ఓ అల్లాహ్! మేము నిన్ను వారికి ప్రత్యర్థిగా చేస్తున్నాము. వారి దుష్టయత్నాల నుంచి నీ శరణు వేడుతున్నాము).

అబద్ధాలకోరుకి అల్లాహ్ సన్మార్గం చూపడు.[47]

يَٰقَوْمِ لَكُمُ ٱلْمُلْكُ ٱلْيَوْمَ ظَٰهِرِينَ فِى ٱلْأَرْضِ فَمَن يَنصُرُنَا
مِنۢ بَأْسِ ٱللَّهِ إِن جَآءَنَا ۚ قَالَ فِرْعَوْنُ مَآ أُرِيكُمْ
إِلَّا مَآ أَرَىٰ وَمَآ أَهْدِيكُمْ إِلَّا سَبِيلَ ٱلرَّشَادِ ﴿٢٩﴾

**29** "ఓ నా జాతి ప్రజలారా! ఈ రోజు మీరు అధికారంలో ఉన్నారు. భూమిపై మీ ఆధిక్యత కొనసాగుతోంది.[48] కాని అల్లాహ్ తరఫున మనపై ఏదైనా విపత్తు వచ్చిపడితే, మనల్ని ఆదుకునే వాడెవడు?"[49] దానికి ఫిరౌన్ ఇలా సమాధానమిచ్చాడు : "నేను చూసేదే మీకు చెబుతున్నాను. సక్రమమైన మార్గం వైపుకే మీకు దర్శకత్వం వహిస్తున్నాను."[50]

45. అంటే, అతడు అల్లాహ్ సార్వభౌమత్వాన్ని, ఆయన పోషకత్వాన్ని (రుబూబియత్‌ను) ఇట్టే విశ్వసించటం లేదు, అతని 'విశ్వాసం' వెనుక ప్రబలమైన ఆధారాలున్నాయి. ప్రస్ఫుటమైన నిదర్శనాలున్నాయి.

46. ఒకవేళ అతను చూపే నిదర్శనాలతో మీకు సంతృప్తి కలగకపోతే, అతని సత్యవాదన మీకు మింగుడు పడకపోతే కనీసం అతన్ని అతని మానాన వదలిపెట్టండి. ఇది కనీస మర్యాద. అంతేగాని అన్యాయంగా అతనిపై దాడి జరపకండి. అతనిపై నీలాపనిందలు మోపకండి. ఒకవేళ అతను అసత్యం పలికితే దేవుడు అతన్ని ఇహపరాలలో శిక్షిస్తాడు. ఒకవేళ అతను గనక సత్యవంతుడైతే – మీరతన్ని వేధించినందుకు–అతను హెచ్చరించే శిక్షలలో ఏదో ఒకటి మీపై విరుచుకుపడటం తథ్యం.

47. దీని భావం ఏమిటంటే (మీరు అనుమానిస్తున్నట్లు) అతను గనక అసత్యవాది అయివుంటే దేవుడు అతనికి అసాధారణమైన మహిమలను, సూచనలను ప్రసాదించేవాడే కాదు. కాని మీరు మూసానే చూడండి – అతని దగ్గర శక్తిమంతమైన నిదర్శనాలున్నాయి.

ఈ వాక్యానికి ఇంకొక అర్థం ఏమిటంటే, మూసా చెప్పేది అబద్ధమైతే దేవుడే అతన్ని పరాభవానికి లోనుచేస్తాడు. మీరంతా కలిసి అతనిపై చర్య తీసుకోవాల్సిన అవసరమే లేదు.

48. దేవుడు మీకు భూమండలంపై రాజ్యాధికారాన్ని, ప్రాబల్యాన్ని ప్రసాదించి మీకు మహోపకారం చేశాడు. కాబట్టి మీరు ఆయనకు కృతజ్ఞులై ఉండండి. దైవప్రవక్తను ధిక్కరించి దైవాగ్రహాన్ని చేజేతులా కొనితెచ్చుకోకండి.

49. దేవుని తరఫున ఏదన్నా ఆపద గనక వచ్చిపడితే మీ సైనిక బలగంగానీ, మీ అధికార

30 అప్పుడు ఆ విశ్వాసి ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! ఇతర సముదాయాలపై వచ్చిన (గడ్డు) దినం మీపై కూడా వస్తుందేమోనని నాకు భయంగా ఉంది.

وَقَالَ الَّذِيٓ اٰمَنَ يٰقَوْمِ اِنِّيٓ اَخَافُ عَلَيْكُمْ مِّثْلَ يَوْمِ الْاَحْزَابِ ۝٣٠

31 "ఉదాహరణకు నూహ్, ఆద్, సమూద్ జాతుల వారికి, ఆ తరువాత వచ్చిన వారికి[51] (పట్టిన దుర్గతే మీకూ పట్టవచ్చు). తన దాసులకు అన్యాయం చేయాలన్నది అల్లాహ్ అభిమతం ఎంతమాత్రం కాదు.[52]

مِثْلَ دَاْبِ قَوْمِ نُوْحٍ وَّعَادٍ وَّثَمُوْدَ وَالَّذِيْنَ مِنْۢ بَعْدِهِمْ ۭ وَمَا اللّٰهُ يُرِيْدُ ظُلْمًا لِّلْعِبَادِ ۝٣١

32 "మరి ఓ నా జాతివారలారా! కేకలేసి పిలిచే రోజు మీకు దాపురిస్తుందన్న భయం కూడా నాకుంది.[53]

وَيٰقَوْمِ اِنِّيٓ اَخَافُ عَلَيْكُمْ يَوْمَ التَّنَادِ ۝٣٢

---

బలంగానీ ఎందుకూ పనికిరాదు. తన ఆంతర్యంలో విశ్వాసం (ఈమాన్)ను దాచి ఉంచుకున్న విశ్వాసి పలికిన మాటలివి.

50. ఫిరౌన్ తన ప్రాపంచిక హోదా, అధికార బలం ఆధారంగా అబద్ధం చెప్పాడు. తాను చూపే దారే సరైన దారి అనీ, తాను తన కళ్లతో చూస్తున్న దానినే తన జనులకు చెబుతున్నానని అన్నాడు. నిజానికి అది సరైనది కాదు. "వాస్తవానికి ఫిరౌను జారీచేసిన ఏ ఉత్తర్వు కూడా సరైనది కాదు." (హూద్ – 97)

51. విశ్వసించిన 'ఆ వ్యక్తి' మరోసారి తన జనులకు హెచ్చరిక చేయటం మొదలెట్టాడు– చూడండి! మనం గనక దైవప్రవక్త మాటలను త్రోసిపుచ్చామంటే పూర్వం తిరస్కరించిన జాతులకు పట్టిన దుర్గతే మనకూ పట్టవచ్చు....

52. అంటే అల్లాహ్ ఎవరికి శిక్ష విధించినా వారు చేసిన పాపాల కారణంగానే శిక్షించాడు. దైవాజ్ఞలను పెడచెవిన పెట్టి, దైవప్రవక్త మాటలను ఎగతాళి చేసిన వారినే ఆయన అంతమొందించాడు. ఆయన ఊరికే ఎవరిజోలికీ పోడు. ఆయన అమిత దయామయుడు, ప్రేమమయుడు. అకారణంగా ఆయన అన్యాయం చేసేవాడు కాడు. కాకపోతే దుర్మార్గం మితిమీరిపోయినపుడు, పాపాలు పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు ఆయన చట్టం ఆయా వ్యక్తులను, సముదాయాలను చుట్టుముట్టుతుంది.

53. **'తనాదీ'** అంటే ఒకరింకొకరిని బిగ్గరగా పిలవటం, కేకవేయటం అని అర్థం. ప్రళయ దినాన్ని **'యౌముత్తనాద్'** అని కూడా అంటారు. ఎందుకంటే ఆనాడు ఒండొకరిని కేకలేసి పిలుస్తుంటారు. స్వర్గవాసులు నరకవాసుల్ని, నరకవాసులు స్వర్గవాసుల్ని

يَوْمَ تُوَلُّونَ مُدْبِرِينَ مَا لَكُم مِّنَ اللَّهِ مِنْ عَاصِمٍ ۗ وَمَن يُضْلِلِ اللَّهُ فَمَا لَهُ مِنْ هَادٍ ﴿٣٣﴾

**33** "ఆ రోజు మీరు వెన్ను చూపి తిరిగిపోతారు.[54] మిమ్మల్ని అల్లాహ్ (పట్టు) నుండి కాపాడేవాడెవడూ ఉండడు. అల్లాహ్ మార్గభ్రష్టతకు గురిచేసినవారికి సన్మార్గం చూపేవాడెవడూ ఉండడు.[55]

وَلَقَدْ جَاءَكُمْ يُوسُفُ مِن قَبْلُ بِالْبَيِّنَاتِ فَمَا زِلْتُمْ فِي شَكٍّ مِّمَّا جَاءَكُم بِهِ ۖ حَتَّىٰ إِذَا هَلَكَ قُلْتُمْ لَن يَبْعَثَ اللَّهُ مِن بَعْدِهِ رَسُولًا ۚ كَذَٰلِكَ يُضِلُّ اللَّهُ مَنْ هُوَ

**34** "లోగడ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా మీ వద్దకు స్పష్టమైన ప్రమాణాలను తీసుకువచ్చాడు.[56] అయినప్పటికీ ఆయన తెచ్చిన విషయాలపై మీరు అనుమానం తోనే ఉన్నారు.[57] చివరకు ఆయన మరణించినపుడు,[58] 'ఈయన తరువాత అల్లాహ్ ఇంకా ఏ ప్రవక్తనూ పంపబోడు'[59] అని మీరు చెప్పుకోసాగారు. ఈ విధంగా

పిలుస్తుంటారు (అల్ ఆరాఫ్ – 48, 49). మరికొంతమంది వ్యాఖ్యాతల ప్రకారం మీజాన్ (త్రాసు) దగ్గర ఒక దైవదూత నిలబడి ఉంటాడు. ఎవరి సత్కర్మల తక్కెడ తేలికగా ఉంటుందో, వారి దౌర్భాగ్యం గురించి ఆ దైవదూత బిగ్గరగా ప్రకటిస్తాడు. మరికొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఆనాడు మానవుల కర్మలనుబట్టి వారిని పిలవటం జరుగుతుంది. ఉదాహరణకు : స్వర్గవాసులను 'ఓ స్వర్గవాసులారా!' అనీ, నరకానికి ఆహుతి అయ్యేవారిని 'ఓ నరకవాసులారా!' అని పిలవటం జరుగుతుంది. ఇమామ్ ఇబ్నె కసీర్ ఏమంటున్నారంటే, ఇమామ్ బఘ్వీ గారి ఈ ప్రవచనం చాలా బావుంది. ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకునే దీనికి ఈ పేరు పెట్టబడిందని ఆయన అన్నారు.

54. అంటే మహ్షర్ మైదానం నుంచి నరకానికి పోతారు. లేదా లెక్కలు తేల్చబడిన తరువాత అక్కడి నుండి పలాయనం చిత్తగిస్తారు.

55. అంటే అటువంటి దౌర్భాగ్యులకు సన్మార్గం చూపి, వారిని నరకయాతన నుంచి కాపాడటం ఎవరి తరమూ కాదు.

56. ఓ ఈజిప్టు వాసులారా! ఈ విధంగా దైవప్రవక్తలు దైవసందేశాన్ని తీసుకుని రావటం కొత్తదేమీ కాదు. మీకు పూర్వం మీ తాతముత్తాతల వద్దకు హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) కూడా దైవనిదర్శనాలను తీసుకువచ్చారు.

57. కాని మీరు ఆయన మాటలను కూడా నమ్మలేదు. పైగా ఆయన (యూసుఫ్) తెచ్చిన సూచనలను తీవ్రంగా అనుమానించారు. సంశయాలకు లోనయ్యారు.

مُسۡرِفٌ مُّرۡتَابٌۨ ﴿٣٤﴾

అల్లాహ్ హద్దుమీరే వారినీ, సందేహాలతో బతికేవారిని అపమార్గానికి లోను చేస్తాడు.[60]

ٱلَّذِينَ يُجَٰدِلُونَ فِيٓ ءَايَٰتِ ٱللَّهِ بِغَيۡرِ سُلۡطَٰنٍ أَتَىٰهُمۡۖ كَبُرَ مَقۡتًا عِندَ ٱللَّهِ وَعِندَ ٱلَّذِينَ ءَامَنُواْۚ كَذَٰلِكَ يَطۡبَعُ ٱللَّهُ عَلَىٰ كُلِّ قَلۡبِ مُتَكَبِّرٖ جَبَّارٖ ﴿٣٥﴾

**35** "(ఎందుకంటే) వారు తమ వద్దకు వచ్చిన ఏ ప్రమాణమూ లేకుండానే, అల్లాహ్ నిదర్శనాల విషయంలో (మొండిగా) వాదిస్తారు.[61] ఈ పోకడ అల్లాహ్ వద్ద, విశ్వాసుల వద్ద కూడా ఎంతో అయిష్టకరమైనది.[62] ఈ విధంగా గర్విష్ఠి, క్రూరుడైన ప్రతి వ్యక్తి హృదయంపై అల్లాహ్ ముద్రవేసేస్తాడు."[63]

وَقَالَ فِرۡعَوۡنُ يَٰهَٰمَٰنُ ٱبۡنِ لِي صَرۡحٗا لَّعَلِّيٓ أَبۡلُغُ ٱلۡأَسۡبَٰبَ ﴿٣٦﴾

**36** ఫిరౌన్ ఇలా అన్నాడు : "ఓ హామాన్! నా కోసం ఒక ఎత్తయిన కట్టడాన్ని నిర్మించు.[64] బహుశా నేను ఆ మార్గాలపైకి పోతానేమో –

58. అంటే హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) చనిపోయినప్పుడు....

59. అంటే దైవప్రవక్తలకు వ్యతిరేకంగా మాట్లాడటం, వారి పిలుపును పరిహసించటం మీకు హాబీగా మారిపోయింది. అందుకే ఆయన చనిపోయినందుకు మీరు లోలోపలే సంతసించారు. ఇకమీదట ప్రవక్త రాడులే అనుకుని తృప్తిచెందారు. లేక మీ వైఖరి ప్రవక్తలు వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు అన్నట్టుగా మారిపోయింది లేక యూసుఫ్ ప్రవక్త చనిపోయాక అంతటి గొప్ప ప్రవక్త మళ్ళీక్కడ పుడతాడూ? అంటూ సానుభూతి వ్యక్తం చేశారు. సాధారణంగా మహాపురుషులు చనిపోయినప్పుడు జనులు స్పందించే తీరు ఇలాగే ఉంటుంది.

60. ఈనాడు మీరు మార్గవిహీనత యొక్క ఆఖరి అంచుల దాకా వెళ్ళిపోయారంటే అందులో ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే యధేచ్ఛగా పాపాలకు ఒడిగట్టే వారికి, ప్రతి చిన్న విషయాన్ని అనుమానిస్తూ కూర్చునే వారికి దేవుడు సన్మార్గం చూపడు. అందునా 'దేవుని ఏకత్వం' విషయంలో పొద్దస్తమానం శంకకు గురైన వాణ్ణి దేవుడు అసలే మార్గం చూపడు.

61. అల్లాహ్ తరఫున అవతరించిన ప్రమాణబద్ధమైన విషయమేదీ వారివద్ద లేదు. అయినప్పటికీ వారు దేవుని ఏకత్వం (తౌహీద్) విషయంలో, దైవాదేశాల విషయంలో దెబ్బలాడుతున్నారు. ఇలాంటి తలతిక్క మనుషులు అన్ని కాలాల్లోనూ ఉన్నారు, ఉంటారు.

37 "ఆ గగన మార్గాలలోకి పోయి, మూసా ఆరాధిస్తున్న దేవుణ్ణి తొంగి చూస్తాను.[65] ఖచ్చితంగా ఇతను (మూసా) అబద్ధాల కోరని నా అనుమానం."[66] ఈ విధంగా ఫిరౌన్ దురాగతాలు అతనికి అందమైనవిగా చూపబడ్డాయి.[67] అతడు సన్మార్గం నుంచి ఆపివేయబడ్డాడు.[68] ఫిరౌన్ పన్నిన పన్నాగాలన్నీ (అతని) వినాశానికే దోహదపడ్డాయి.[69]

أَسْبَابَ السَّمٰوٰتِ فَأَطَّلِعَ إِلٰٓى إِلٰهِ مُوسٰى وَإِنِّي لَأَظُنُّهُ كَاذِبًا ۚ وَكَذٰلِكَ زُيِّنَ لِفِرْعَوْنَ سُوٓءُ عَمَلِهِ وَصُدَّ عَنِ السَّبِيلِ ۚ وَمَا كَيْدُ فِرْعَوْنَ إِلَّا فِي تَبَابٍ ﴿٣٧﴾

38 విశ్వసించిన ఆ వ్యక్తే ఇంకా ఇలా అన్నాడు : "ఓ నా జాతి (ప్రజలారా)! మీరు (అందరూ) నన్ను అనుసరించండి. నేను మిమ్మల్ని మంచి మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తాను.[70]

وَقَالَ الَّذِيٓ اٰمَنَ يٰقَوْمِ اتَّبِعُونِ أَهْدِكُمْ سَبِيلَ الرَّشَادِ ﴿٣٨﴾

62. వీళ్ళ డొంక తిరుగుడు మాటలను అల్లాహ్ మాత్రమే అసహ్యించుకోడు, విశ్వాసులు కూడా ఏవగించుకుంటారు.

63. దైవ వాక్యాలకు, నిదర్శనాలకు వ్యతిరేకంగా మంకుతనంతో, గర్వంతో వాదించే ఇలాంటి ప్రబుద్ధుల హృదయాలకు దేవుడు సీలు వేసేస్తాడు. ఆ తరువాత వారి కళ్లకు మంచి మంచిగా, చెడు చెడుగా కానరాదు. ఒక్కోసారి వారికి మంచి చెడుగానూ, చెడు మంచిగానూ కనిపిస్తుంది.

64. ఇది ఫిరౌన్ తలబిరుసుతనానికి మరో నిదర్శనం. అతడు తన మంత్రి అయిన హామాను నుద్దేశించి, ఒక ఎత్తయిన మేడను కట్టమని ఆజ్ఞాపించాడు. ఆ మేడ సహాయంతో ఆకాశ ద్వారాల వరకూ పోయి మూసా దేవుణ్ణి చూస్తానన్నాడు. ఆ మాటల్లో వెటకారం, అహంకారం కలగలసి ఉన్నాయి. **'అస్బాబ్'** (أَسْبَاب) అంటే ద్వారాలు లేక మార్గాలు అని అర్థం. మరిన్ని వివరాలకు ఖసస్ సూరా 28వ ఆయతు.

65. అంటే ఆకాశంపైన నిజంగానే అతని దేవుడు ఉన్నాడో లేడో చూస్తాను.

66. అంటే – ఆకాశంలో అల్లాహ్ ఉన్నాడన్న మూసా మాటలపై నాకేమాత్రం నమ్మకం లేదు. తాను అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తనని అతను చెబుతున్నదంతా వట్టిదే.

67. ఈ విధంగా షైతాన్ అతన్ని (ఫిరౌనును) అపమార్గానికి గురిచేశాడు. అతను చేసే దుష్కార్యాలన్నీ అతని కంటికి మంచి పనులుగా కానరాసాగాయి.

68. అంటే అతను సత్యం నుంచి, పుణ్యకార్యాల నుంచి ఆపబడ్డాడు. పైగా అతను అపమార్గాలలో దేవులాడుతూ ఉండిపోయాడు.

**39** "ఓ నా జాతి (వారలారా!) ఈ ప్రాపంచిక జీవిత సౌఖ్యాలు తాత్కాలిక మైనవి.[71] పరలోకమే శాశ్వతంగా ఉండే నిలయం.[72]

يٰقَوْمِ اِنَّمَا هٰذِهِ الْحَيٰوةُ الدُّنْيَا مَتَاعٌ وَّاِنَّ الْاٰخِرَةَ هِيَ دَارُ
الْقَرَارِ ﴿۳۹﴾

**40** "ఎవడయినా పాపానికి పాల్పడితే దానికి సరిసమానమైన (పాప) ఫలమే అతనికి లభిస్తుంది.[73] మరెవడయినా పుణ్యకార్యం చేస్తే – అతడు పురుషుడైనా, స్త్రీ అయినా – అతడు గనక విశ్వాసి అయివుంటే[74] – అలాంటి వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారక్కడ లెక్క లేనంత ఉపాధిని పొందుతారు.[75]

مَنْ عَمِلَ سَيِّئَةً فَلَا يُجْزٰٓى اِلَّا مِثْلَهَا ۚ وَمَنْ عَمِلَ
صَالِحًا مِّنْ ذَكَرٍ اَوْ اُنْثٰى وَهُوَ مُؤْمِنٌ فَاُولٰٓئِكَ
يَدْخُلُوْنَ الْجَنَّةَ يُرْزَقُوْنَ فِيْهَا بِغَيْرِ حِسَابٍ ﴿۴۰﴾

---

69. **'తబాబ్'** (تَبَاب) అంటే వినాశం, నష్టం అనే అర్థాలు వస్తాయి. ఫిరౌన్ ఎప్పుడు, ఏ పన్నాగం పన్నినా అది అతని పాలిట నష్టకరంగానే పరిణమించింది. చివరకు అతను తన సైన్యం సమేతంగా సముద్రంలో ముంచివేయబడ్డాడు.

70. ఫిరౌన్ వర్గానికి చెందిన ఆ విశ్వాసి మరోసారి ఉపదేశించాడు – తన జాతివారిని సరైన మార్గంలో నడిపిస్తున్నానని ఫిరౌన్ బీరాలు పోతున్నాడు. కాని వాస్తవానికి అతను స్వయంగా దారి తప్పినవాడు. కనుక మీరు ఫిరౌన్ అడుగుజాడల్లో నడవకండి. మీరు నా మార్గాన్ని అనుసరించండి. నేను చూపే మార్గమే రుజుమార్గం. మూసా (అలైహిస్సలాం) మిమ్మల్ని ఆహ్వానించే మార్గమే ఇది.

71. ఈ ప్రాపంచిక జీవితం క్షణభంగురం. ఇదో మూన్నాళ్ళ ముచ్చట! పరలోక జీవితంతో పోల్చుకుంటే ఇది ఒక ఉదయకాలం, లేక సాయంకాలం వంటిది.

72. ఎందుకంటే అది శాశ్వతమైనది, అనశ్వరమైనది. స్వర్గానికి పోయినవారైనా, నరకానికి పోయినవారైనా శాశ్వతంగా అక్కణ్ణే ఉంటారు. అక్కడ ఎవరికీ చావు రాదు. అక్కడి నుంచి ప్రస్థానం అనేది ఉండదు. ఆ పరలోకంలో ఒక రకం జీవితం సుఖసౌఖ్యాలతో కూడుకున్నదైతే మరొకటి యాతనతో కూడుకున్నది.

73. అంటే దుర్మార్గానికి ఒడిగట్టిన వారికి ఆ దుర్మార్గానికి సరిపడా శిక్ష మాత్రమే పడుతుంది. అంతకన్నా ఎక్కువ శిక్ష పడదు. అంటే ఆ శిక్ష పూర్తిగా న్యాయబద్ధంగా ఉంటుంది.

74. అంటే వారు సదాచార సంపన్నులై ఉండటంతో పాటు, విశ్వాసులు కూడా అయి ఉంటారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే 'విశ్వాసం' లేని సదాచరణ

41 "ఓ నా జాతి (జనులారా)! నేను మిమ్మల్ని మోక్షం వైపునకు పిలుస్తుంటే,[76] మీరు నన్ను నరకాగ్ని వైపునకు పిలుస్తారేమిటి?[77]

وَيٰقَوْمِ مَا لِيْٓ اَدْعُوْكُمْ اِلَى النَّجٰوةِ وَتَدْعُوْنَنِيْٓ اِلَى النَّارِ ۝٤١

42 "నేను అల్లాహ్‌ను తిరస్కరించాలనీ, నేనెరుగని వాటిని ఆయనకు సహవర్తులుగా నిలబెట్టాలని మీరు నన్ను ఆహ్వానిస్తుంటే, నేను మాత్రం మిమ్మల్ని అసాధారణ శక్తిశాలి, క్షమాశీలి (అయిన అల్లాహ్) వైపునకు ఆహ్వానిస్తున్నాను.[78]

تَدْعُوْنَنِيْ لِاَكْفُرَ بِاللّٰهِ وَاُشْرِكَ بِهٖ مَا لَيْسَ لِيْ بِهٖ عِلْمٌ ۡ وَّاَنَا اَدْعُوْكُمْ اِلَى الْعَزِيْزِ الْغَفَّارِ ۝٤٢

43 "మీరు నన్ను ఎవరి వైపునకు పిలుస్తున్నారో వారు ఇహలోకంలోగానీ,[79]

لَا جَرَمَ اَنَّمَا تَدْعُوْنَنِيْٓ اِلَيْهِ لَيْسَ لَهٗ دَعْوَةٌ فِي الدُّنْيَا

నిష్ఫలం. 'సదాచరణ' లోపించిన విశ్వాసం నిరర్థకం. దైవసన్నిధిలో సాఫల్యం పొందాలంటే విశ్వాసంతో పాటు సదాచరణ, సదాచరణతోపాటు విశ్వాసం ఉండాలి.

75. అంటే స్వర్గంలో దేవుడు వారికి ప్రసాదించే అనుగ్రహాలు అగణ్యామైనవి. అనంతమైనవి. అవి అయిపోతాయి అనే చింత ఎవరికీ ఉండదు.

76. అంటే – నేను మిమ్మల్ని ఏకదైవారాధన వైపుకు ఆహ్వానిస్తున్నాను. సహవర్తులెవరూ లేని ఒకే ఒక్క దైవాన్ని ఆరాధించమని చెబుతున్నాను. ఆయన పంపిన ప్రవక్తను ధృవపరచమని అంటున్నాను. మీకు సన్మార్గం చూపే నిమిత్తం దేవుడు అతన్ని పంపాడు అని బోధపరుస్తున్నాను. కాని మీరేమో....

77. ..... మీరు షిర్క్ (బహుదైవారాధన) వైపుకు నన్ను పిలుస్తున్నారాయె. మీరు పిలిచే మార్గం మనిషిని నరకం వైపుకు గొనిపోతుంది. తదుపరి ఆయతులో ఆ మాటే అనబడింది.

78. ఇక్కడ **'అజీజు'** (الْعَزِيْز) అంటే అవిశ్వాసులపై పగతీర్చుకోవటంలో, వారిని శిక్షించటంలో సాటిలేని మేటి, అసాధారణ శక్తిశాలి అని భావం. **'గఫ్ఫార్'** (الْغَفَّار) అంటే తనను నమ్మి నడుచుకునే వారి పొరపాట్లను మన్నించేవాడని, వారి లోపాలను మరుగుపరిచే వాడని భావం. కాని మీరు ఏ చిల్లర దేముళ్ళ వైపుకు పిలుస్తున్నారో వారు దేనికీ అర్హులు కారు. వారు మొరలను ఆలకించలేరు. అక్కరలను తీర్చలేరు. లాభనష్టాలను కలిగించే శక్తి వారికి (వాటికి) లేనేలేదు.

79. అంటే పిలిచేవారి పిలుపును అందుకుని, వారి కష్టాలను దూరంచేసే శక్తి మీ మిథ్యా

وَلَا فِي الْاٰخِرَةِ وَاَنَّ مَرَدَّنَآ اِلَى اللّٰهِ وَاَنَّ الْمُسْرِفِيْنَ
هُمْ اَصْحٰبُ النَّارِ ﴿٤٣﴾

పరలోకంలోగానీ[80] పిలువటానికి అసలు యోగ్యులు కారన్న విషయంలో సందేహానికి ఆస్కారమే లేదు.[81] మరి మనమంతా మరలిపోవలసింది అల్లాహ్ వద్దకే (అన్నది కూడా నిర్వివాదాంశమే).[82] మరి బరితెగించి పోయేవారే నరకవాసులవుతారు[83] (అనేది కూడా ముమ్మాటికీ నిజం).

దైవాలకు లేదు. అసలు దైవం అని పిలిపించుకునే అర్హతే వాటికి లేదు. క్రింద పొందు పరచబడిన ఈ ఆయతులలో కూడా ఇంచుమించు అదే భావం ఉంది –

1. "అల్లాహ్‌ను వదలి, ప్రళయదినం వరకూ తమ ప్రార్థనలకు స్పందించని వారిని మొరపెట్టుకునే వాడికన్నా మార్గభ్రష్టుడు మరెవడుంటాడు? పైగా మొరపెట్టుకునేవారు, మొరపెట్టుకునేది తమనేనన్న సంగతి కూడా వారికి తెలీదాయె!" (అహ్ఖాఫ్ – 5).

2. "ఒకవేళ మీరు వారిని పిలిచినా వారు మీ పిలుపును వినరు. ఒకవేళ విన్నా వాటిని ఆమోదించలేరు." (ఫాతిర్ – 14)

80. పోనీ కనీసం పరలోకంలోనయినా వారు తమ భక్తుల పిలుపును అందుకుని, వారికోసం ఏమైనా సిఫారసు చేయగలుగుతారా?! అంటే అదీ లేదు. మరి అటువంటి అశక్తులు ఆరాధ్య దైవాలవుతారా? అటువంటి నిస్సహాయులను పూజించటం, వారిపై ఆశలు పెంచుకోవటం సమంజసమా?

81. **'లా జరమ'** (لَاجَرَمَ) అంటే నిశ్చయం, తథ్యం, అందులో సందేహానికి తావేలేదు అన్న అర్థాలు వస్తాయి.

82. అక్కడ అందరి లెక్కలు తేల్చబడతాయనేది, అందరికీ వారి వారి సంపాదననుబట్టి 'ఫలితం' వొసగబడుతుందనేది కూడా సత్యమే.

83. అంటే అవిశ్వాసులు, ముష్రిక్కులు, దేవుని అవిధేయతలో హద్దుమీరి పోయేవారు, ఎలాగూ నరకవాసులే. అలాగే ముస్లిములమని చెప్పుకుంటూనే లెక్కలేనన్ని పాపాలు చేస్తూ పోయేవారు, అవిధేయతలో ఆఖరి అంచుల దాకా వెళ్ళిపోయినవారు కూడా కొంతకాలం పాటు నరకయాతనకు గురి కాక తప్పదు. అయితే ఆ తరువాత వారు మహాప్రవక్త ముహమ్మద్ (స) సిఫారసుపైనో లేక అల్లాహ్ ప్రమేయంతోనో నరకం నుంచి తీయబడి స్వర్గానికి పంపబడతారు.

44 "మున్ముందు మీరు నేను చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకుంటారు.[84] నేను మటుకు నా వ్యవహారాన్ని అల్లాహ్‌కు అప్పగిస్తున్నాను.[85] నిశ్చయంగా అల్లాహ్ తన దాసులందరినీ చూస్తూనే ఉన్నాడు."[86]

فَسَتَذْكُرُونَ مَآ أَقُولُ لَكُمْ ۚ وَأُفَوِّضُ أَمْرِىٓ إِلَى ٱللَّهِ ۚ إِنَّ ٱللَّهَ بَصِيرٌۢ بِٱلْعِبَادِ ﴿٤٤﴾

45 ఎట్టకేలకు అల్లాహ్ అతన్ని, వారు పన్నిన దుష్టపన్నాగాల కీడు నుంచి రక్షించాడు.[87] కాగా; ఫిరౌనీయులపై బహు చెడ్డ విపత్తు విరుచుకుపడింది.[88]

فَوَقَىٰهُ ٱللَّهُ سَيِّـَٔاتِ مَا مَكَرُوا۟ ۖ وَحَاقَ بِـَٔالِ فِرْعَوْنَ سُوٓءُ ٱلْعَذَابِ ﴿٤٥﴾

46 (ఇదిగో) అగ్ని – దాని ఎదుట వారు ప్రతి ఉదయం, సాయంత్రం రప్పించబడుతుంటారు.[89] మరి ప్రళయం సంభవిం

ٱلنَّارُ يُعْرَضُونَ عَلَيْهَا غُدُوًّا وَعَشِيًّا ۖ وَيَوْمَ تَقُومُ

84. ఓ నా జాతి సోదరులారా! ఈనాడు మీరు నా మాటలను ఖాతరు చేయటం లేదు. కాని త్వరలోనే మీరు నా ఉపదేశాన్ని జ్ఞాపకం చేసుకుని బాధపడే సమయం వస్తుంది. కాని అప్పుడు మీరు బాధపడినా, సిగ్గుతో కుంచించుకుపోయినా మీకు ఒరిగేదేమీ ఉండదు.

85. అంటే నేను ఆయన్నే నమ్ముకుంటున్నాను. ఆయనపైనే భారమంతా మోపుతున్నాను. అన్ని వేళలా సహాయం కొరకు ఆయన్నే అర్థిస్తున్నాను. మీతోనూ, మీ బూటకపు దేముళ్ళతోనూ తెగత్రెంపులు చేసుకుంటున్నానని ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను.

86. ఆయన అందరి స్థితిగతులనూ చూస్తూనే ఉన్నాడు. సన్మార్గానికి అర్హులెవరో చూసి అలాంటి వారికి ఆయన ఆ సద్బుద్ధిని ఒసగుతాడు. అపమార్గాన పోదలచిన వారిని అపమార్గానికే లోను చేస్తాడు. ఈ వ్యవహారాల్లో దాగివున్న మర్మాన్ని ఆయన బాగా ఎరుగు.

87. ఆ విశ్వాసి తెగవారైన ఖిబ్తీలు అతన్ని కడతేర్చాలని పథకాలు వేశారు. అయితే అల్లాహ్ వారి పథకాలను, దుష్టవ్యూహాలన్నింటినీ వమ్ము చేసి ఆ వ్యక్తిని హజ్రత్ మూసా (అలైహిస్సలాం)తో పాటు వారి చెర నుంచి విముక్తినిచ్చాడు. పరలోకంలో నయితే ఆ విశ్వాసికి స్వర్గంలో నివాసం కల్పించబడుతుంది.

88. వారు ప్రపంచంలోనేమో ఎర్ర సముద్రంలో ముంచివేయబడ్డారు. పరలోకంలో వారికి వ్యథాభరితమైన నరకయాతన ఖాయం.

89. అంటే బర్జఖ్ అవస్థలో–సమాధిలో–వారు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అగ్ని

السَّاعَةُ أَدْخِلُوا آلَ فِرْعَوْنَ أَشَدَّ الْعَذَابِ ﴿٤٦﴾

చిన నాడు, "ఫిరౌను జనులను దుర్భరమైన శిక్షలో పడవేయండి"[90] (అని సెలవీయ బడుతుంది).

وَإِذْ يَتَحَاجُّونَ فِي النَّارِ فَيَقُولُ الضُّعَفَاءُ لِلَّذِينَ اسْتَكْبَرُوا إِنَّا كُنَّا لَكُمْ تَبَعًا فَهَلْ أَنْتُمْ مُغْنُونَ عَنَّا نَصِيبًا مِنَ النَّارِ ﴿٤٧﴾

**47** మరి వారు నరకాగ్నిలో (కాలుతూ) పరస్పరం వాదోపవాదాలు మొదలెట్టినప్పుడు బలహీనులు, గర్విష్టుల నుద్దేశించి, "మేము మీకు తాబేదార్లుగా ఉన్నాం కదా! మరి మీరిప్పుడు ఈ అగ్నిలో ఏ కొంత భాగాన్నయినా మా నుండి తొలగించగలరా?!" అని అంటారు.

---

ముందు హాజరుపరచబడతారు. దీనిద్వారా సమాధి యాతన నిజమని రూఢీ అవుతోంది. కాని కొంతమంది ఈ విషయాన్ని నిరాకరిస్తున్నారు. అయితే హదీసులలో సమాధి యాతన గురించి చాలా స్పష్టంగా చెప్పబడింది. ఉదాహరణకు : హజ్రత్ ఆయిషా (రజి అల్లాహు అన్హా) వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా మహాప్రవక్త (సఅసం) "అవును! సమాధి యాతన సత్యం" అని అన్నారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ జనాయెజ్). అలాగే వేరొక హదీసులో ఈ విధంగా ప్రవచించబడింది : "మీలో ఎవరైనా చనిపోయినపుడు (సమాధిలో) ఉదయం, సాయంత్రం అతని ముందు అతని నివాస స్థలం చూపించబడుతూ ఉంటుంది. అంటే ఆ వ్యక్తి స్వర్గవాసి అయితే స్వర్గం, నరకవాసి అయితే నరకం అతని ఎదుట ప్రత్యక్షపరచబడుతూ ఉంటుంది. 'ఇది నీ అసలు స్థలం. తీర్పుదినాన అల్లాహ్ నిన్ను ఇక్కడకు పంపబోతున్నాడు' అని అతనితో అనబడుతుంది" (సహీహ్ బుఖారీ, ముస్లిం – కితాబుల్ జన్నతి). దీన్నిబట్టి తేలిందేమంటే సమాధి యాతన సత్యం. కాని సమాధి యాతనను త్రోసిపుచ్చే ప్రబుద్ధులు ఖుర్ఆన్ హదీసులు చెప్పే విషయాలను ఒప్పుకోవటం లేదన్నమాట!

90. దీన్నిబట్టి స్పష్టంగా బోధపడేదేమిటంటే ఉదయం, సాయంత్రం అగ్ని చూపెట్టబడేది తీర్పుదినానికి ముందే. తీర్పు దినానికి – ప్రళయదినానికి – ముందు ఏముందంటే అది సమాధి జీవితమే. అంటే బర్జఖ్ అవస్థ. తీర్పుదినాన ఈ పాపాత్ములను సమాధుల నుంచి తీసి బాధాకరమైన నరకయాతనకు ఆహుతి చేయటం జరుగుతుంది. **'ఆలె ఫిరౌన్'** అంటే ఫిరౌన్‌తో పాటు అతని రాజవంశస్థులు, అతని జాతిజనులు, అతని వెనుక నడిచిన అనుయాయులు అందరూ ఉన్నారు.

సమాధిలో మృతుడు హాయిగా పడివున్నాడు కదా! మరి అతను శిక్షను చవిచూస్తున్నాడంటే ఎలా నమ్మేది?! అని ఎవరైనా సందేహపడవచ్చు. ఇలా అనటం వ్యర్థప్రేలాపన అనబడుతుంది. ఎందుకంటే సమాధి యాతన మన కంటికి కనబడనవసరం లేదు.

قَالَ الَّذِينَ اسْتَكْبَرُوٓا إِنَّا كُلٌّ فِيهَآ إِنَّ اللَّهَ قَدْ حَكَمَ
بَيْنَ الْعِبَادِ ﴿٤٨﴾

**48** దానికి ఆ గర్విష్ఠులు "మనమంతా ఈ అగ్నిలో ఉన్నాం కదా! అల్లాహ్ తన దాసుల మధ్య తీర్పు చేసేశాడు" అని సమాధానమిస్తారు.

وَقَالَ الَّذِينَ فِي النَّارِ لِخَزَنَةِ جَهَنَّمَ ادْعُوا رَبَّكُمْ
يُخَفِّفْ عَنَّا يَوْمًا مِّنَ الْعَذَابِ ﴿٤٩﴾

**49** మరి నరకవాసులంతా కలసి, "(కనీసం) ఒక్కరోజు శిక్షనైనా కాస్త తగ్గించమని మీ ప్రభువును కోరండి" అని నరకపాలకులతో అంటారు.

قَالُوٓا أَوَلَمْ تَكُ تَأْتِيكُمْ رُسُلُكُم بِالْبَيِّنَٰتِ ۖ قَالُوا
بَلَىٰ ۚ قَالُوا فَادْعُوا ۗ وَمَا دُعَٰٓؤُا الْكَٰفِرِينَ
إِلَّا فِي ضَلَٰلٍ ﴿٥٠﴾

**50** దానికి వారు, "ఎందుకు, మీ ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తీసుకుని మీ వద్దకు రాలేదా?!" అని అడుగుతారు. "ఎందుకు రాలేదు? (వచ్చిన సంగతి నిజమే)" అని నరకవాసులు అంటారు. "మరైతే మీరే విజ్ఞప్తి చేసుకోండి"[91] అని నరకపాలకులు చెబుతారు. (కాని) అవిశ్వాసుల విజ్ఞాపనలు నిరర్థకం తప్ప మరేమీ కావు.[92]

---

అల్లాహ్ అన్ని విధాలా శిక్షించే సామర్థ్యం కలవాడు. నిద్రావస్థలో – కలలుగనే వారిని మనం చూడటం లేదా? కలలో మనిషి వర్ణనాతీతమైన బాధను అనుభవిస్తాడు. కాని అతన్ని చూసేవారికి, అతను బాధపడుతున్నాడని అస్సలు అనిపించదు. ఇలాంటి ఉపమానాలు మనముందు ఉన్నప్పటికీ సమాధి యాతనను త్రోసిపుచ్చటం మంకుతనం, అనుచిత పోకడ తప్ప మరేమీ కాదు. స్వప్నావస్థ సంగతి అలా ఉంచితే, మెలకువతో ఉన్న మనిషికి కలిగే నొప్పి, బాధ కూడా మనకంటికి కానరాదు. మనిషి బాధతో మూల్గటం, మెలికలు తిరిగిపోవటం చూసి అతనికి బాధ కలుగుతుందని అనుకుంటాము. ఆ వ్యక్తి గనక తన బాధను వ్యక్తం చేయకపోతే అది కూడా మనం తెలుసుకోలేము.

91. దైవప్రవక్తలు నిదర్శనాలను తీసుకువచ్చిన పిదప కూడా, వాటిని తిరస్కరించి, దైవాగ్రహానికి గురైన వారికోసం మేమెందుకు ప్రార్థించాలి? ఆ అభ్యర్థన ఏదో మీరే మీ ప్రభువుకు చేసుకోండి అని నరకపాలకులు నిర్ద్వంద్వంగా చెప్పేస్తారు.

92. అప్పుడు వాళ్లు స్వయంగా తమ ప్రభువుకు తమ గోడు వినిపించుకుంటారు. కాని వాళ్ల గోడు ఆలకించబడదు. ఎందుకంటే ప్రాపంచిక జీవితంలో వాళ్లకు చెప్పాల్సిందంతా చెప్పేయటం జరిగింది. పరలోకం విశ్వసించే, పశ్చాత్తాపం చెందే స్థలం కాదు.

| | |
|---|---|
| **51** నిశ్చయంగా మేము మా ప్రవక్తలకు, విశ్వాసులకు ప్రాపంచిక జీవితంలోనూ సహాయపడతాము,[93] సాక్ష్యాలిచ్చేవారు నిలబడే రోజున కూడా[94] (సహాయం చేస్తాము). | إِنَّا لَنَنصُرُ رُسُلَنَا وَالَّذِينَ آمَنُوا فِي الْحَيَاةِ الدُّنْيَا وَيَوْمَ يَقُومُ الْأَشْهَادُ ﴿٥١﴾ |

ఇది ప్రతిఫలం పొందే స్థలం. ప్రపంచంలో చేసుకున్నదానికి ఇక్కడ ఫలితం అనుభవించక తప్పదు.

93. అంటే – మేము వారి శత్రువులను పరాజితుల్ని చేసి, వారికి విజయాన్ని చేకూరుస్తాము. మరి కొంతమంది ప్రవక్తలు వధించబడ్డారు కదా! అన్న సందేహం ఈ సందర్భంగా కొందరికి కలగవచ్చు. ఉదాహరణకు: దైవప్రవక్త హజ్రత్ యహ్యా, హజ్రత్ జకరియ్యా (అలైహిముస్సలాం)లు హత్యకు గురయ్యారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం), హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) లాంటి ప్రవక్తలు తమ స్వదేశాన్ని వదలి మరో చోటికి వలసపోవలసి వచ్చింది. ప్రవక్తల ప్రియసహచరులు కూడా దైవమార్గంలో ప్రస్థానం చేయవలసి వచ్చింది. దేవుడు సహాయం చేస్తానని వాగ్దానం చేసిన తరువాత కూడా ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అన్న ప్రశ్న కూడా ఉత్పన్నం కావచ్చు.

వాస్తవానికి ఇదొక సుదీర్ఘ ప్రక్రియ. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో సత్యతిరస్కారులకు ఆధిక్యత లభించినంతమాత్రాన, అసత్యం సత్యానికి విరుద్ధంగా ఆర్భాటం చేసినంత మాత్రాన దైవ వాగ్దానం నెరవేరకుండా పోదు. అల్లాహ్ తన ప్రణాళిక ననుసరించి, కొన్నిచోట్ల, కొన్ని అవిశ్వాస వర్గాలకు ఆధిక్యతను ఇవ్వవచ్చు. కాని ఎట్టకేలకు విశ్వాసులే గెలుస్తారు. సత్యమే నిలబడుతుంది. ఆఖరికి యహ్యా, జకరియ్యాల హంతకులపై కూడా దేవుడు శత్రువులను విధించాడు. వారు ఆ జాతుల వారిని దారుణంగా చంపి తమ రక్తదాహాన్ని తీర్చుకున్నారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు–అలైహిస్సలాం)ను శిలువపై ఎక్కించగోరిన యూదులకు పట్టిన గతేమిటో చూడండి. దేవుడు వారిపై రోమనులకు విజయం వొసగాడు. వాళ్లు యూదులను శతవిధాలా అవమానించారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు, ఆయన ప్రియ శిష్యులకు కూడా మక్కా నుండి వలసపోవటం వినా మార్గాంతరం లేకపోయింది. కాని చివరికి జరిగిందేమిటి? బద్ర్, ఉహద్, ఖైబర్ యుద్ధాల ద్వారా, మక్కా విజయం ద్వారా అల్లాహ్ ముస్లింలకు అపూర్వంగా సహాయపడ్డాడు. దాంతో అసత్య వాదుల నడ్డి విరిగిపోయింది. ఇంత జరిగిన తరువాత కూడా దేవుడు తన ప్రియదాసులకు తోడ్పాటును అందజేస్తాడన్న విషయంలో సంశయం ఏముందీ? (ఇబ్నె కసీర్).

94. **'అష్హాద్'** (الْأَشْهَادُ) అనేది **'షహీద్'** అనే పదానికి బహువచనం. ప్రళయదినాన దైవదూతలు దైవప్రవక్తల కార్యనిర్వహణ గురించి సాక్ష్యమిస్తారు – 'ఓ అల్లాహ్! నీ

**52** ఆ రోజు దుర్మార్గులకు వారి సంజాయిషీ ఎంతమాత్రం ఉపయోగ పడదు. వారిపై శాపం పడుతుంది. మరి వారి కోసం బహుచెడ్డ నివాసం ఉంటుంది.[95]

يَوْمَ لَا يَنفَعُ الظَّٰلِمِينَ مَعْذِرَتُهُمْ وَلَهُمُ اللَّعْنَةُ وَلَهُمْ سُوٓءُ الدَّارِ ﴿٥٢﴾

**53** మరి మేము మూసాకు మార్గదర్శిని ప్రసాదించాము.[96] ఇస్రాయీల్ సంతతిని ఆ గ్రంథానికి వారసులుగా చేశాము.[97]

وَلَقَدْ ءَاتَيْنَا مُوسَى الْهُدَىٰ وَأَوْرَثْنَا بَنِىٓ إِسْرَٰٓءِيلَ الْكِتَٰبَ ﴿٥٣﴾

**54** బుద్ధిజీవులకు అది మార్గ దర్శినిగా, హితబోధినిగా ఉండేది.[98]

هُدًى وَذِكْرَىٰ لِأُولِى الْأَلْبَٰبِ ﴿٥٤﴾

ప్రవక్తలు నీ సందేశాన్ని యధాతథంగా తమ ప్రజలకు అందజేశారు. కాని ఆయా జాతుల వారు వారిని ధిక్కరించారు' అని చెబుతారు. లేదా దైవప్రవక్తలు మరియు దైవదూతలు కలిసి తమ పని తీరు గురించి సాక్ష్యమిస్తారు. అలాగే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) మరియు ఆయన అనుచర సమాజ సభ్యులు కూడా సాక్ష్యమిస్తారని ఇంతకు ముందు ప్రస్తావనకు వచ్చింది. అందుకే ప్రళయదినాన్ని సాక్షులు నిలబడే రోజుగా పేర్కొనటం జరిగింది. ఆ రోజు విశ్వాసులకు దేవుడు తోడ్పడతాడంటే వారి సత్కర్మల ప్రకారం వారికి మంచి ప్రతిఫలం ఇస్తాడని, వారికి స్వర్గంలో ప్రవేశం కల్పిస్తాడని భావం.

95. అంటే వారు దైవకారుణ్యానికి దూరమైపోతారు. ఆనాడు వారు చెప్పే సాకులు, ఇచ్చుకునే సంజాయిషీలు స్వీకారయోగ్యం కావు. ఎందుకంటే అది సంజాయిషీలు చెప్పుకునే స్థలం కాదు. అందుకే వారి సాకులు, క్షమాపణలు నిష్ఫలం అవుతాయి.

96. అంటే, మేము అతనికి దైవదౌత్యంతో పాటు, తౌరాత్ గ్రంథాన్ని అనుగ్రహించాము. "మేము మార్గదర్శకత్వం, కాంతితో కూడుకున్న తౌరాతు గ్రంథాన్ని అవతరింపజేశాము" (అల్ మాయిద – 44) అన్న ఆయతు ద్వారా బోధపడేది ఇదే!

97. అంటే, హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తదనంతరం కూడా తౌరాతు గ్రంథం మిగిలి ఉంది. బనీ ఇస్రాయీల్‌లో అనేక తరాల వారు – ఒకరి తరువాత మరొకరు – దానికి వారసులుగా చెలామణీ అయ్యారు. లేదా ఇక్కడ 'గ్రంథం' అంటే ఇస్రాయీల్ వంశీయుల్లో ప్రవక్తల ద్వారా అందజేయబడిన అన్ని గ్రంథాలు అని భావం.

98. **'ఉలుల్ అల్‌బాబ్'** అంటే బుద్ధిజీవులు, విజ్ఞులు, మేధా సంపన్నులు, సవ్యమైన భావాలు గలవారు, సదవగాహన గలవారు అన్న అర్థాలు వస్తాయి. మంచి అవగాహన గలవారే ఆకాశ గ్రంథాల ద్వారా ప్రయోజనం పొందగలుగుతారు. హితబోధను

فَاصْبِرْ إِنَّ وَعْدَ اللَّهِ حَقٌّ وَّاسْتَغْفِرْ لِذَنْۢبِكَ وَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ بِالْعَشِيِّ وَالْإِبْكَارِ ﴿٥٥﴾

**55** కనుక (ఓ ప్రవక్తా!) సహనం వహించు. నిస్సందేహంగా అల్లాహ్ వాగ్దానం నిజమైనది. నువ్వు నీ పొరపాట్ల క్షమాపణకై[99] వేడుకుంటూ ఉండు. సాయం సమయంలోనూ, ప్రభాత సమయం లోనూ[100] నీ ప్రభువు పవిత్రతను కొని యాడుతూ, స్తోత్రం చేస్తూ ఉండు.

إِنَّ الَّذِينَ يُجَادِلُونَ فِي آيَاتِ اللَّهِ بِغَيْرِ سُلْطَانٍ أَتَاهُمْ ۙ إِنْ فِي صُدُورِهِمْ إِلَّا كِبْرٌ مَّا هُمْ بِبَالِغِيهِ ۚ فَاسْتَعِذْ بِاللَّهِ ۖ إِنَّهُ هُوَ السَّمِيعُ الْبَصِيرُ ﴿٥٦﴾

**56** ఎవరయితే తమ వద్దకు వచ్చిన ప్రమాణమేదీ లేకుండానే అల్లాహ్ ఆయతుల విషయంలో గొడవపడు తున్నారో, వారి ఆంతర్యాలలో గర్వం తప్ప మరేమీ లేదు. వారు ఎలాగూ దానిని (తమ లక్ష్యాన్ని) చేరుకోలేరు.[101] కనుక నువ్వు మాత్రం అల్లాహ్ శరణువేడుతూ ఉండు. నిశ్చయంగా ఆయన అంతా వినేవాడు, అన్నింటినీ చూసేవాడు.

గ్రహించగలుగుతారు. ఇతరుల ఉపమానం పుస్తకాలను మోసే గాడిదల వంటిది. వారి వద్ద గ్రంథాలైతే ఉంటాయి. కాని ఆ గ్రంథాలలో ఏముందో వారికి తెలీదు.

99. ఇక్కడ **'పొరపాట్లు'** అంటే మానవ సహజమైన దౌర్బల్యం వల్ల జరిగే చిన్నపాటి పొరపాట్లు, మరుపువల్ల జరిగే లోపాలు అని భావం. అలాంటి తప్పులను సయితం అల్లాహ్ అప్పటికప్పుడే ఎత్తిచూపి, తన ప్రవక్తలను వాటి బారినుంచి రక్షిస్తాడు. అయినప్పటికీ తప్పుల మన్నింపు కోసం అర్థించమని ఉపదేశించటం జరిగింది. ఎందుకంటే మన్నింపు కోసం వేడుకోవటం కూడా ఆరాధనే. పుణ్యఫలాన్ని పెంచేందుకు దేవుడు ఈ విధంగా ఆజ్ఞాపించి ఉంటాడు. లేదా ప్రవక్త అనుచర సమాజంలోని వారు ఇస్తెగ్ఫార్ (మన్నింపు) పట్ల వైముఖ్యాన్ని చూపకుండా ఉండేటందుకు ఈ విధంగా నొక్కి వక్కాణించబడి ఉంటుంది.

100. **'అషియ్యి'** (**الْعَشِيِّ**) అంటే పగలులోని ఆఖరి సమయం, రాత్రి యొక్క ఆరంభ ఘడియ అని అర్థం. **'ఇబ్‌కార్'** (الْإِبْكَارِ) అంటే రాత్రి చివరి భాగం, పగటి ఆరంభ దశ (ప్రభాత సమయం) అని అర్థం.

101. అంటే వారు చేసే వాదనల్లో పసలేదు. వాదించటానికి వారివద్ద సరకు కూడా లేదు. కేవలం తమ పెద్దరికాన్ని నిలుపుకునే తాపత్రయంతో, సత్యాన్ని కించపరచాలన్న

لَخَلْقُ السَّمٰوٰتِ وَالْاَرْضِ اَكْبَرُ مِنْ خَلْقِ النَّاسِ وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ ۝٥٧

**57** నిశ్చయంగా భూమ్యాకాశాల సృష్టి మానవ సృష్టికన్నా గొప్ప విషయం. కాని చాలామంది దీన్ని తెలుసుకోరు.[102]

وَمَا يَسْتَوِي الْاَعْمٰى وَالْبَصِيْرُ ۙ وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَلَا الْمُسِيْٓءُ ۭ قَلِيْلًا مَّا تَتَذَكَّرُوْنَ ۝٥٨

**58** గుడ్డివాడు – చూపున్నవాడు సమానులు కారు. అలాగే విశ్వసించి, మంచి పనులు చేసేవారు – పాపాత్ములు (సమానులు కాజాలరు).[103] కాని మీరు హితబోధను గ్రహించేది (చాలా) తక్కువ.

اِنَّ السَّاعَةَ لَاٰتِيَةٌ لَّا رَيْبَ فِيْهَا وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يُؤْمِنُوْنَ ۝٥٩

**59** ప్రళయం (రావటం) తథ్యం. అందులో సందేహానికి తావే లేదు. కాని చాలామంది దీన్ని విశ్వసించరు (అది వేరే విషయం).

وَقَالَ رَبُّكُمُ ادْعُوْنِيْٓ اَسْتَجِبْ لَكُمْ ۭ اِنَّ الَّذِيْنَ

**60** మరి మీ ప్రభువు ఏమంటున్నాడంటే, "మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను.[104] నా దాస్యం పట్ల

---

దురుద్దేశంతో వారు ఈ పిల్లి మొగ్గలు వేస్తున్నారు. ఎన్ని వాదనలు చేసినా వారు తమ లక్ష్యాన్ని ఛేదించలేరు.

102. మరలాంటప్పుడు, అల్లాహ్ మనుషుల్ని మరోసారి తిరిగి లేపుతాడనే విషయాన్ని వీళ్లు ఎందుకు నమ్మటం లేదు? ఆయన దృష్టిలో ఈ పని భూమ్యాకాశాల నిర్మాణం కన్నా చాలా తేలిక కదా!

103. దీని భావం ఏమిటంటే అంధుడు – కళ్లున్నవాడు సమానులు కానట్లే విశ్వాసి – అవిశ్వాసి సమానులు కాలేరు. మంచివాడు – దుర్మార్గుడు ఎన్నటికీ సరిసమానులు కాలేరు. పైగా తీర్పుదినాన వారి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. ఆ వ్యత్యాసం కొట్టొచ్చినట్లే కనిపిస్తుంటుంది.

104. ఇంతకు ముందు వచ్చిన ఆయతులో దేవుడు ప్రళయం రాక గురించి చెప్పాడు. ఈ ఆయతులో మానవాళికి మార్గదర్శక నియమావళిని ఇస్తున్నాడు. ఈ నియమావళిని అవలంబించినవాడు పరలోకంలో అనుగ్రహ భాగ్యానికి నోచుకుంటాడు. ఈ ఆయతులోని 'దుఆ'ను చాలామంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు ఆరాధన, దైవదాస్యం అన్న అర్థంలో తీసుకున్నారు. అంటే ఒకే దైవాన్ని ఆరాధించాలని అన్నారు. హదీసుల ద్వారా కూడా ఈ విషయం మనకు అవగతం అవుతోంది. ఉదాహరణకు: **'అద్దుఆవు హువల్ ఇబాదతు.'** (దుఆయే ఆరాధన) ఇంకా **'అద్దుఆవు ముఖ్ఖుల్ ఇబాదతి'** (దుఆ ఆరాధనా

يَسْتَكْبِرُوْنَ عَنْ عِبَادَتِيْ سَيَدْخُلُوْنَ جَهَنَّمَ دٰخِرِيْنَ ﴿٦٠﴾

గర్వాహంకారం ప్రదర్శించేవారు త్వర లోనే అవమానితులై నరకంలో ప్రవేశించటం తథ్యం."[105]

اَللّٰهُ الَّذِيْ جَعَلَ لَكُمُ الَّيْلَ لِتَسْكُنُوْا فِيْهِ وَالنَّهَارَ مُبْصِرًا ۭ اِنَّ اللّٰهَ لَذُوْ فَضْلٍ عَلَى النَّاسِ وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَشْكُرُوْنَ ﴿٦١﴾

**61** అల్లాహ్ మీ కొరకు రాత్రిని చేశాడు – అందులో మీరు విశ్రాంతి పొందటానికి![106] మరి ఆయనే పగటిని (మీరు) చూడగలిగేదిగా చేశాడు.[107] నిశ్చయంగా అల్లాహ్ ప్రజల పట్ల దయాదాక్షిణ్యాలు గలవాడు. కాని ప్రజలలో చాలామంది కృతజ్ఞత తెలుపరు.[108]

సారం) (ముస్నదె అహ్మద్ - 4/271; మిష్కాత్ - అద్దావాత్). "నా దాస్యంపట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు..." అనే వాక్యాన్నిబట్టి కూడా ఇక్కడ 'దుఆ' అంటే దాస్యం లేక దైవారాధనే అని విదితమవుతోంది.

అయితే మరికొంతమంది వ్యాఖ్యాతలు మాత్రం ఈ ఆయతు యందలి దుఆను 'దుఆ' (ప్రార్థన, వేడుకోలు) అన్న భావంలోనే తీసుకున్నారు. అంటే మేలు కొరకు అల్లాహ్‌ను అభ్యర్థించటం, కీడును తొలగించమని కోరటం. షరీయతు ప్రకారం 'దుఆ' అంటే అభ్యర్థించటం, కోరటం అని అర్థం. దీన్ని ఇతరత్రా అర్థాల్లో తీసుకోవటం అంటే అది ఒకవిధమైన అన్వయింపే. అదలా వుంచితే 'దుఆ' కూడా తన భావార్థం రీత్యా, ప్రస్తావిత హదీసుల దృష్ట్యా (ఒకవిధంగా) దైవారాధనే. ఎందుకంటే భౌతిక విధానానికి అతీతంగా ఎవరినయినా ఏదైనా అభ్యర్థిస్తే అది అతని దాస్యంగానే పరిగణించబడుతుంది (ఫత్‌హుల్ ఖదీర్). రెండు విధాలుగా పరిశీలించినా తేలే విషయం ఒక్కటే – అదేమంటే తమ అక్కరలు తీర్చమని, తమకు సహాయపడమని అల్లాహ్‌ను తప్ప వేరొకరిని అర్థించటం, ఆరాధించటం వేరొకరిపై నమ్మకం పెట్టుకోవటం అధర్మం.

105. దైవారాధన పట్ల వైముఖ్యం చూపటం వల్ల లేక దైవారాధనలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించటం వల్ల ఎదురయ్యే దుష్ఫలితం ఇది!

106. ఆయన రాత్రిని చీకటిమయంగా చేయటంలోని మర్మం ఏమిటంటే మీ కార్యకలాపాలు, పరుగులు స్థంభించిపోవాలి. అప్పుడే మీరు హాయిగా నిద్రపోయి నూతనోత్తేజాన్ని పొందుతారు.

107. పగటిపూట మీరు కష్టపడి సంపాదించటానికి వీలుగా దానిని ప్రకాశవంతంగా, ప్రతి వస్తువు కానవచ్చేదిగా చేశాడు.

108. దైవానుగ్రహాల పట్ల చాలామందిలో కృతజ్ఞతా భావం ఉండదు. కనీసం దేవుని మేళ్లను

ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ خَالِقُ كُلِّ شَيْءٍ ۘ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۡ
فَاَنّٰى تُؤْفَكُوْنَ ﴿٦٢﴾

**62** ఈ అల్లాహ్‌యే మీ (అందరికీ) ప్రభువు, ప్రతి వస్తువునూ సృష్టించినవాడు. ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. మరి మీరు ఎటు తిరిగిపోతున్నారు?[109]

كَذٰلِكَ يُؤْفَكُ الَّذِيْنَ كَانُوْا بِاٰيٰتِ اللّٰهِ
يَجْحَدُوْنَ ﴿٦٣﴾

**63** ఇదే విధంగా (పూర్వం) అల్లాహ్ ఆయతులను తిరస్కరించేవారు కూడా తిరిగిపోయేవారు.

اَللّٰهُ الَّذِيْ جَعَلَ لَكُمُ الْاَرْضَ قَرَارًا وَّالسَّمَآءَ بِنَآءً
وَّصَوَّرَكُمْ فَاَحْسَنَ صُوَرَكُمْ وَرَزَقَكُمْ مِّنَ
الطَّيِّبٰتِ ؕ ذٰلِكُمُ اللّٰهُ رَبُّكُمْ ۚۖ فَتَبٰرَكَ اللّٰهُ
رَبُّ الْعٰلَمِيْنَ ﴿٦٤﴾

**64** అల్లాహ్‌యే[110] మీ కోసం భూమిని నివాసస్థలంగా చేశాడు.[111] ఆకాశాన్ని పందిరిగా నిర్మించాడు.[112] మీ రూపురేఖలను తీర్చిదిద్దాడు. మీకు చాలా అందమైన రూపాన్నిచ్చాడు.[113] తినటానికి పరిశుద్ధమైన ఆహార పదార్థాలను ప్రసాదించాడు.[114] ఈ అల్లాహ్‌యే మీ ప్రభువు. మరి సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ శుభాలు కలవాడు.

---

కూడా వారు అంగీకరించరు. మేలును మరిచే దుర్గుణం మూలంగా వారీవిధంగా ప్రవర్తిస్తారు. దైవానుగ్రహాల పట్ల ఏమరుపాటు వల్ల కూడా వారిలో ఈ ధోరణి ప్రబలుతుంది. సాధారణంగా సత్యతిరస్కారులు, అజ్ఞానులు ఈ విధంగా ప్రవర్తిస్తారు.

109. మరలాంటప్పుడు ఒక్కడైన అల్లాహ్ ముందు తలవంచకుండా మిమ్మల్ని ఎవరు అడ్డుకుంటున్నారు?

110. ఇక్కడి నుంచి కొన్ని దైవానుగ్రహాలు వివరించబడ్డాయి. అల్లాహ్ గొప్ప శక్తిమంతుడని, అపురూప నిర్మాత అనీ, సహవర్తులెవరూ లేని అద్వితీయుడని చెప్పటానికి ఈ దృష్టాంతాలు ఇవ్వబడుతున్నాయి.

111. మీరు నేలపై నిలకడగా ఉంటున్నారు. దానిపై సంచరిస్తున్నారు. కట్టడాలు నిర్మిస్తున్నారు. దైనందిన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరణించిన పిదప ఆ మట్టిలోనికే పోయి, ప్రళయదినం వరకూ అందులోపడి ఉంటున్నారు.

112. ఆకాశం ఒక అపురూపమైన కప్పు. స్థిరంగా ఉండే పందిరి. అది గనక విరిగి మీద పడుతుందన్న భయం ఉంటే ఏ మనిషీ నిశ్చింతగా నిద్రపోడు. మిన్ను విరిగి ఎక్కడ మీద పడుతుందోనన్న భయం ఉంటే జనులు స్వేచ్ఛగా, నిర్భయంగా రాకపోకలు సాగించరు.

113. భూమండలంలో ఎన్నో రకాల ప్రాణులున్నప్పటికీ వాటన్నింటికన్నా అందమైన

هُوَ الْحَيُّ لَآ اِلٰهَ اِلَّا هُوَ فَادْعُوْهُ مُخْلِصِيْنَ
لَهُ الدِّيْنَ ۭ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿٦٥﴾

**65** ఆయన సజీవుడు. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి మీరు స్వచ్ఛమైన ఆరాధనను ఆయనకే సమర్పిస్తూ ఆయన్ని వేడుకోండి.[115] ప్రశంసలన్నీ సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే చెందుతాయి.

قُلْ اِنِّيْ نُهِيْتُ اَنْ اَعْبُدَ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ
اللّٰهِ لَمَّا جَاۗءَنِيَ الْبَيِّنٰتُ مِنْ رَّبِّيْ ۡ وَاُمِرْتُ اَنْ
اُسْلِمَ لِرَبِّ الْعٰلَمِيْنَ ﴿٦٦﴾

**66** (ఓ ప్రవక్తా!) వారికి ఈ విధంగా చెప్పు: "మీరు అల్లాహ్‌ను వదలి మొరపెట్టుకుంటున్నటువంటి వాటిని నేను పూజించటాన్ని వారించటం జరిగింది.[116] ఆ మేరకు నా వద్దకు నా ప్రభువు తరపున సూచనలు వచ్చేశాయి. సకల లోకాల ప్రభువుకే నేను విధేయుడనై ఉండాలని (కూడా) నాకు ఆజ్ఞాపించబడింది."[117]

ఆకారాన్ని (మానవులైన) మీకే ఆయన ఇచ్చాడు. మీ శరీరావయవాలను చాలా చక్కగా అమర్చాడు. నఖశిఖ పర్యంతం మిమ్మల్ని తీర్చిదిద్దాడు.

114. ఎన్నో రకాల స్వాదిష్టమైన ఆహారపదార్థాలను, పండ్లను మీకు ప్రసాదించాడు. అవి రుచికరమైనవి మాత్రమే కావు, బలాన్నిచ్చేవి కూడాను.

115. అన్నీ సమకూర్చినవాడు ఆయనే అయినప్పుడు, ఈ ఏర్పాట్లలో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేనప్పుడు, మరి ఆరాధనలకు అర్హుడు కూడా ఆ ఒక్క దేవుడే కదా! అందుకే ఆయన్నే ఆరాధించండి. ఆయన్నే అర్థించండి. మన్నింపు కోసం ఆయన్నే వేడుకోండి. ఆయనే అందరి మొరలను ఆలకిస్తాడు. ఆయన తప్ప మరొకరెవరూ మీ గోడును వినిపించుకోలేడు. ఇదంతా మీకు తెలిసినప్పుడు ఆయన్ని కాదని ఇతరులను ఆశ్రయించటం, కష్టాలను తీర్చమని ఇతరులను వేడుకోవటం ఎంతవరకు ధర్మం?

116. అవి రాతి విగ్రహాలైనా, లేక వారు దైవప్రవక్తలైనా, సత్పురుషులైనా, సమాధులలో ఖననమై ఉన్న వారైనా – ఎవరినీ మొరపెట్టుకోరాదు. వారి పేరుమీద మొక్కుకోవటం, మొక్కుబడులు చెల్లించటం చేయకూడదు. వారిపై ఎలాంటి ఆశలూ పెట్టుకోకూడదు. వారికి ఏ విధంగానూ భయపడకూడదు. ఎందుకంటే ఇవన్నీ ఆరాధనల క్రిందికి వస్తాయి. ఇలాంటి ఆరాధనలు అల్లాహ్‌కు మాత్రమే చెందుతాయి.

117. దీని ద్వారా దేవుని ఏకత్వం రూఢీ అవుతోంది. దివ్య ఖుర్ఆన్‌లో పదే పదే దేవుని

هُوَ الَّذِىۡ خَلَقَكُمۡ مِّنۡ تُرَابٍ ثُمَّ مِنۡ نُّطۡفَةٍ ثُمَّ مِنۡ عَلَقَةٍ ثُمَّ يُخۡرِجُكُمۡ طِفۡلًا ثُمَّ لِتَبۡلُغُوۡۤا اَشُدَّكُمۡ ثُمَّ لِتَكُوۡنُوۡا شُيُوۡخًا ‌ۚ وَمِنۡكُمۡ مَّنۡ يُّتَوَفّٰى مِنۡ قَبۡلُ وَلِتَبۡلُغُوۡۤا اَجَلًا مُّسَمًّى وَّلَعَلَّكُمۡ تَعۡقِلُوۡنَ ۝٦٧

**67** ఆయనే మిమ్మల్ని మట్టితో, పిమ్మట వీర్యపు బిందువుతో,[118] ఆ తరువాత ఘనీభవించిన రక్తంతో సృష్టించాడు. తరువాత మిమ్మల్ని శిశువు రూపంలో (తల్లి గర్భం నుంచి) బయటకు తీస్తున్నాడు. మరి మీరు యుక్తవయస్సుకు చేరేటందుకు మీకు ఎదుగుదలను ఇస్తున్నాడు, ఆపైన వార్ధక్యానికి చేరుకునేందుకు (గడువు ఇస్తున్నాడు).[119] మీలో కొందరు ఆ స్థితికి చేరకముందే చనిపోతున్నారు.[120] మీరు నిర్ణీత గడువుకు చేరుకోవటానికి,[121] మీరు గ్రహించ గలగటానికి[122] (వీలుగా ఆయన మీకు అవకాశం ఇస్తూ ఉన్నాడు).

ఏకత్వానికి సంబంధించిన నిదర్శనాలు ఇవ్వబడ్డాయి. ఇస్లాం అంటేనే అసలు విధేయత, ఆజ్ఞాపాలన అని అర్థం. గొప్పవాడు, ఒకే ఒక్కడైన దేవుని ముందు వినయంగా తలవంచటం, దైవాజ్ఞలకు కట్టుబడి ఉండటమే ఇస్లాం ధర్మం. ఆయన ఆజ్ఞల పట్ల తలబిరుసుతనం చూపకూడదు. దీని తర్వాత మరోసారి దేవుని ఏకత్వానికి సంబంధించిన మరికొన్ని నిదర్శనాలు ఇవ్వబడ్డాయి.

118. మీ పితామహుడైన హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను ఆయన మట్టితో చేశాడు. అందువల్ల మానవులందరూ కూడా మట్టితోనే పుట్టించబడినట్లుగా భావింపబడుతారు. ఆ తరువాత మానవ పరంపరను వీర్యంతో ముడిపెట్టాడు. ఇప్పుడు ప్రతి మనిషీ వీర్యం (రేతస్సు)తోనే పుడుతున్నాడు. అది పురుషుని వెన్నులో నుంచి వెలువడి, స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశించి, మానవ సృజనకు శ్రీకారం చుట్టుతుంది. కాకపోతే ఒక్క హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు – అలైహిస్సలాం) మాత్రమే తండ్రి లేకుండా – అద్భుత రీతిలో – సృజించబడ్డారు. దివ్య ఖుర్ఆన్ ద్వారా మనకు తెలిసే సత్యం ఇది. దీనిపై ముస్లిం సమాజమంతా ఏకాభిప్రాయం కలిగి వుంది.

119. మనిషి ఈ దశలన్నింటినీ అధిగమించేలా చేసేవాడు ఒక్క అల్లాహ్ యే. ఈ వ్యవహారాల్లో ఆయనకు ఎవరూ సహవర్తులు లేరు.

120. అంటే మాతృగర్భంలో వివిధ దశలను దాటిన తరువాత పుట్టకముందే చనిపోయేవారు కొందరైతే, బాల్యదశలోనే తనువు చాలించేవారు మరికొందరు. కొందరు యుక్త వయస్సుకు చేరాక చనిపోతే, ఇంకా కొందరు ముసలితనానికి చేరి కాలం చేస్తారు.

هُوَ الَّذِي يُحْيِي وَيُمِيتُ ۖ فَإِذَا قَضَىٰ أَمْرًا فَإِنَّمَا يَقُولُ لَهُ كُن فَيَكُونُ ﴿٦٨﴾

**68** జీవితాన్ని ప్రసాదించేవాడు, మరణాన్ని వొసగేవాడు ఆయనే.[123] మరి ఆయన ఏ పనైనా చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, దాన్నుద్దేశించి 'అయిపో' అని మాత్రమే అంటాడు. అంతే, అది అయిపోతుంది.[124]

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ يُجَادِلُونَ فِي آيَاتِ اللَّهِ أَنَّىٰ يُصْرَفُونَ ﴿٦٩﴾

**69** అల్లాహ్ వాక్యాల విషయంలో గొడవ చేసే వారిని నువ్వు చూడలేదా?[125] ఇంతకీ వారెక్కడికి మరలించబడుతున్నట్లు?[126]

الَّذِينَ كَذَّبُوا بِالْكِتَابِ وَبِمَا أَرْسَلْنَا بِهِ رُسُلَنَا ۖ فَسَوْفَ يَعْلَمُونَ ﴿٧٠﴾

**70** వారు గ్రంథాన్ని, మా ప్రవక్తలతో పాటు పంపినదానిని కూడా ధిక్కరించారు. వారు త్వరలోనే (యదార్థం ఏమిటో) తెలుసుకుంటారు.

121. ఆయా వ్యక్తులకు రాసిపెట్టి వున్న గడువును వారు అనుభవించటానికి అల్లాహ్ వారికి ఆ అవకాశం ఇస్తున్నాడు.

122. మీరు గనక అపురూపమైన ఈ ప్రక్రియపై నిశిత దృష్టితో ఆలోచిస్తే దీనంతటికీ కారకుడు ఆ మూలవిరాట్టు అయిన అల్లాహ్‌యే అని మీకు తెలిసివస్తుంది. అత్యంత అల్పమైన వీర్యకణం నుంచి మానవ సృజన మొదలవటం, మూడేసి చీకటి తెరల లోపల వివిధ దశలను అధిగమించి సంపూర్ణ మానవాకారాన్ని సంతరించుకోవటం, పుట్టిన పిదప కూడా వివిధ దశలకు చేరుకోవటం – దీన్నంతటినీ గమనిస్తే మీ సృష్టికర్త ఒక్కడేనని, ఆయనకు ఎవరూ సాటిలేరని, ఆయనే మీ ఆరాధ్యదైవమనీ, ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధనలకు అర్హులు కారనే సత్యం బోధపడుతుంది. ఇదంతా చేయగలిగిన ఆ దైవానికి, ప్రళయదినాన చనిపోయిన వారందరినీ తిరిగి బ్రతికించటం ఏమాత్రం క్లిష్టతరం కాదన్న విషయం కూడా మీకు అవగతం అవుతుంది.

123. జీవన్మరణాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన నిర్జీవమైన ఒక వీర్యబిందువుకు – వివిధ దశల ద్వారా – మానవాకారం ఇచ్చి ప్రాణం పోస్తాడు. మరి ఒక నిర్ణీత కాలం తరువాత ఆయన ఆ సజీవ మానవుణ్ణి చంపి మట్టిలోకి చేరుస్తాడు.

124. ఇది ఆయన 'అసాధారణ శక్తి'కి ప్రబల తార్కాణం.

125. అంటే దైవవాక్యాలను త్రోసిపుచ్చే ఉద్దేశ్యంతో, వాటిని పరిహసించే దురాలోచనతో వాదులాటకు దిగేవారు.

**71** అప్పుడు వారి మెడలలో (ఇనుప) పట్టాలు వేయబడి ఉంటాయి, సంకెళ్లు కూడా ఉంటాయి. మరి వారు ఈడ్వ బడతారు.[127]

إِذِ الْأَغْلَالُ فِي أَعْنَاقِهِمْ وَالسَّلَاسِلُ يُسْحَبُونَ ﴿٧١﴾

**72** సలసలా కాగే నీళ్లలోకి. తరువాత నరకాగ్నిలో కాల్చబడతారు.[128]

فِي الْحَمِيمِ ثُمَّ فِي النَّارِ يُسْجَرُونَ ﴿٧٢﴾

**73** "మీరు అల్లాహ్‌ను వదలి సాటి కల్పించిన వారు (చిల్లర దేవుళ్లు) ఎక్కడు న్నారు?"[129] అని వారిని అడగటం జరుగు తుంది.

ثُمَّ قِيلَ لَهُمْ أَيْنَ مَا كُنتُمْ تُشْرِكُونَ ﴿٧٣﴾

**74** (అంటే) అల్లాహ్‌ను వదలి అన్న మాట. "వారు మా నుండి అదృశ్యమై పోయారు.[130] కాదు, మేమింతకు ముందు అసలు దేనినీ మొరపెట్టు కోనేలేదు"[131]

مِن دُونِ اللَّهِ ۖ قَالُوا ضَلُّوا عَنَّا بَل لَّمْ نَكُن نَّدْعُو مِن

126. అంటే స్పష్టమైన నిదర్శనాలు ముందుకు వచ్చేసిన పిదప, సత్యం ప్రస్ఫుటం అయిన తరువాత కూడా వారు విముఖత చూపుతున్నారే?! ఈ వాక్యంలో ఆశ్చర్యం వ్యక్తం చేయబడింది.

127. ఈ తిరస్కారులకు నరకంలో పట్టే దుర్గతి ఇక్కడ కొద్దిగా చిత్రీకరించబడింది.

128. అంటే వాళ్ల ద్వారా నరకం రాజేయబడుతుందనీ, వారు నరకానికి ఇంధనంగా మారుతారని ముజాహిద్, మరియు ముఖాతిల్ పేర్కొన్నారు.

129. ఏమిటి? ఈనాడు వాళ్లు మిమ్మల్ని ఆదుకోగలరా?

130. 'అయ్యో! వాళ్లు మాకు కనబడకుండా పోయారు. ఇంక వాళ్లు మాకు ఏం సాయం చేస్తారు?' అని తలబాదుకుంటారు.

131. అంతలోనే వారి మాటలు తడబడతాయి. అసలు తామెన్నడూ వారిని పూజించనేలేదని ప్లేటు ఫిరాయిస్తారు. "దైవసాక్షి! మేము మా ప్రభువుకు భాగస్వామిగా ఎవరినీ నిలబెట్టలేదు" అని మాట మారుస్తారు (అల్ అన్ఆమ్ – 23). వాళ్లు ఈ మిథ్యా దైవాల పూజను తిరస్కరించటం లేదనీ, తాము చేసిన పూజలు అధర్మం అని ఒప్పుకుం టున్నారని కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు. ఎందుకంటే ఆ రోజు సత్యం వారి ముందుకు వచ్చేస్తుంది. తాము పూజించే విగ్రహాలు చూడలేవని, మాట్లాడలేవని, వినలేవని, లాభనష్టాలు చేకూర్చలేవని ఆనాడు వారికి అర్థమైపోతుంది (ఫత్‌హుల్ ఖదీర్). వాళ్లు షిర్క్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తారనేది ఇంకొక అర్థం. ఈ అర్థమే స్పష్టంగా ఉంది.

قَبْلُ شَيْـًٔا ۚ كَذٰلِكَ يُضِلُّ اللّٰهُ الْكٰفِرِيْنَ ﴿٧٤﴾

అని వారు (తడబడుతూ) చెబుతారు. ఈ విధంగా అల్లాహ్ అవిశ్వాసులను దారి తప్పిస్తాడు.[132]

ذٰلِكُمْ بِمَا كُنْتُمْ تَفْرَحُوْنَ فِى الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ وَبِمَا
كُنْتُمْ تَمْرَحُوْنَ ﴿٧٥﴾

**75** "మీరు భూమ్మీద అన్యాయంగా అదిరిపడుతూ, అనుచిత రీతిలో మిడిసి పడినందుకు జరిగిన శాస్తి ఇది.[133]

اُدْخُلُوْٓا اَبْوَابَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا ۚ فَبِئْسَ مَثْوَى
الْمُتَكَبِّرِيْنَ ﴿٧٦﴾

**76** "ఇక నరక ద్వారాలలోనికి ప్రవేశించండి, ఎల్లకాలం అందులోనే పడి ఉందురుగాని; అహంకారులకు లభించిన ఈ చోటు ఎంత చెడ్డది?!"[134] (అని అనబడుతుంది).

فَاصْبِرْ اِنَّ وَعْدَ اللّٰهِ حَقٌّ ۚ فَاِمَّا نُرِيَنَّكَ بَعْضَ الَّذِىْ

**77** కనుక (ఓ ముహమ్మద్ –స!) నువ్వు సహనం వహించు. అల్లాహ్ వాగ్దానం ముమ్మాటికీ సత్యమైనది.[135] మేము వారికి చేసివున్న వాగ్దానాలలో (హెచ్చరికలలో) కొన్నింటిని మేము నీకు చూపించినా[136]

132. నిరంతరం దైవవాక్యాలను తిరస్కరించటం, దైవప్రవక్తలను ధిక్కరించటం – ఇదెలాంటి రోగమంటే దీనివల్ల కొంతకాలానికి వారి హృదయాలు కలుషితమై, తుప్పు పట్టిపోతాయి. ఇక ఆ తరువాత వారు శాశ్వతంగా సత్యాన్ని పొందే సద్బుద్ధికి దూరమైపోతారు.

133. మీరు నేలపై చెలరేగిపోయినందుకు, అహంకారంతో మిడిసిపడుతూ పాపకార్యాలకు ఒడిగట్టినందుకు, పాపాలు చేస్తూ కూడా నిక్షేపంగా ఉన్నందుకు మీకు ఎదురయిన పర్యవసానం ఇది.

134. నరకానికి కావలివారుగా నియమించబడిన దైవదూతలు నరకవాసులను ఉద్దేశించి పలికే మాటలివి.

135. అంటే మా వాగ్దానం ప్రకారం మేము అవిశ్వాసులపై ప్రతీకారం తీర్చుకుని తీర్తాము. ఈ వాగ్దానం తొందరగా – అంటే ఇహలోకంలో కూడా నెరవేరవచ్చు లేక దైవ ప్రణాళికననుసరించి ఆలస్యం కూడా కావచ్చు. ప్రళయదినాన మాత్రం మేమెలాగూ వారి పని పడతాము. వారు మా పట్టునుంచి ఎట్టి పరిస్థితిలోనూ తప్పించుకోలేరు.

136. (ఓ ప్రవక్తా!) నీవు బ్రతికి ఉండగా వారు పరాభవానికి గురైనా ఆశ్చర్యం లేదు. జరిగింది కూడా అదే. అల్లాహ్ అవిశ్వాసులపై కక్ష తీర్చుకుని ముస్లింల కళ్లకు

నَعِدُهُمْ اَوْ نَتَوَفَّيَنَّكَ فَاِلَيْنَا يُرْجَعُوْنَ ﴿٧٧﴾

లేక (అంతకుముందే) మేము నీకు మరణం వొసగినా (ఎట్టకేలకు) వారంతా మరలిరావలసింది మా వద్దకే కదా![137]

وَلَقَدْ اَرْسَلْنَا رُسُلًا مِّنْ قَبْلِكَ مِنْهُمْ مَّنْ قَصَصْنَا عَلَيْكَ وَمِنْهُمْ مَّنْ لَّمْ نَقْصُصْ عَلَيْكَ ؕ وَمَا كَانَ لِرَسُوْلٍ اَنْ يَّاْتِيَ

**78** నిశ్చయంగా నీకు పూర్వం కూడా మేము ఎంతోమంది ప్రవక్తల్ని పంపి ఉన్నాము. వారిలో కొందరి సంగతులు మేము నీకు తెలియపర్చాము. మరికొందరి వృత్తాంతాలను అసలు నీకు తెలుపనే లేదు.[138] ఏ ప్రవక్త కూడా అల్లాహ్ అనుజ్ఞ లేకుండా ఏ మహిమనూ తీసుకురాలేకపోయేవాడు.[139] మరి

చలువను ప్రసాదించాడు. బద్ర్ సంగ్రామంలో సత్యతిరస్కారులు మట్టి కరచారు. హిజ్రీ 8వ ఏట మక్కా సునాయాసంగా జయించబడింది. మహనీయ ముహమ్మద్ (స) బ్రతికి ఉండగానే యావత్తు అరేబియా ద్వీపం ముస్లింల పాదాక్రాంతమైంది.

137. ఒకవేళ అవిశ్వాసులు ప్రాపంచిక జీవితంలో శిక్షనుంచి తప్పించుకున్నా వారెక్కడికి పోతారు(ట!)? వారెక్కడ చచ్చినా, ఎలా చచ్చినా తుదకు వచ్చేది మా సన్నిధికే. వారికోసం కఠినమైన శిక్ష కాచుకుని ఉంది.

138. కొంతమంది ప్రవక్తల గాథలను మాత్రమే నీకు విశదీకరించటం జరిగింది. చాలా మంది ప్రవక్తల గాథలను వివరించలేదు. దివ్య ఖుర్ఆన్‌లో 25 మంది ప్రవక్తల జీవితగాథలు, వారి జాతుల గాథలు మాత్రమే వివరించబడ్డాయి.

139. ఇక్కడ **'ఆయత్'** అంటే మహిమ లేక అనూహ్యమైన విషయం అని అర్థం. ఈ మహిమ దైవప్రవక్త సత్యబద్ధతను రూఢీ చేస్తుంది. 'నీవు సత్యవంతుడవే అయితే మాకు ఫలానా మహిమను చూపు' అని ఆయా ప్రజలు తమ ప్రవక్తలను కోరేవారు. మక్కా అవిశ్వాసులు సయితం మహాప్రవక్త ముహమ్మద్ (స)ను అనేక విషయాలు కోరారు. బనీ ఇస్రాయీల్ సూరా (90 – 93)లో ఈ వివరాలు వచ్చాయి. ఇక్కడ దైవవచనంలోని భావం ఏమిటంటే, మా అనుమతి లేకుండా ఏ ప్రవక్త కూడా ఏ మహిమనూ ప్రదర్శించలేకపోయేవాడు. మహిమలు ఇవ్వాలా, ఇవ్వకూడదా అనేది మా అధీనంలో ఉన్న విషయం. కొంతమంది ప్రవక్తలకు ప్రారంభం నుంచే కొన్ని మహిమలు ఇవ్వబడ్డాయి. కొన్ని జాతులకు వారి కోరికననుసరించి మహిమలు చూపబడ్డాయి. మరికొన్ని జాతులకు చూపబడలేదు. అదంతా మా ప్రణాళికననుసరించి జరుగుతుంది. అంతేగాని, ఏ ప్రవక్త కూడా, తాను తలచుకున్నప్పుడల్లా, తలచుకున్న అద్భుతాన్ని చేసి చూపలేదు. ఈ ఆయతు ద్వారా మిథ్యా విశ్వాసాలు

అల్లాహ్ ఆజ్ఞ[140] వచ్చేసినపుడు సత్య (న్యాయ) బద్ధంగా తీర్పు జరిగి తీరు తుంది.[141] మరి అసత్యవాదులు మాత్రం అక్కడ నష్టానికి గురవుతారు.

بِاٰیَةٍ اِلَّا بِاِذْنِ اللّٰهِ ۚ فَاِذَا جَآءَ اَمْرُ اللّٰهِ قُضِیَ بِالْحَقِّ وَخَسِرَ هُنَالِكَ الْمُبْطِلُوْنَ ۟﴿۷۸﴾

**79** అల్లాహ్ – ఆయనే మీ కొరకు పశువు లను చేశాడు.[142] వాటిలో కొన్నింటిపై మీరు స్వారీ చేస్తారు. మరి కొన్నింటిని తింటారు.[143]

اَللّٰهُ الَّذِیْ جَعَلَ لَكُمُ الْاَنْعَامَ لِتَرْكَبُوْا مِنْهَا وَمِنْهَا تَاْكُلُوْنَ ۟﴿۷۹﴾

ఖండించబడ్డాయి. కొంతమంది సత్పురుషులు (ఔలియా), వారు తలచుకున్నప్పుడల్లా కొన్ని అసాధారణ పనులు (అద్భుతాలు) చేయగలరని వాదించేవారి బూటకపు మాటలు కూడా నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి. షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మ.లై) గురించి ఈ ప్రబుద్ధులు ఆపాదించేవన్నీ బూటకాలని కూడా ఈ ఆయతు ద్వారా స్పష్టమవు తోంది. అల్లాహ్ తన ప్రవక్తలకు (పైగంబరులకు) సయితం ఈ 'స్వయం ప్రతిపత్తి' ఇవ్వనప్పుడు ఒక వలీకి ఈ తిరుగులేని అధికారం ఎలా ఇస్తాడు? మరిచూడబోతే 'వలీ'కి మహిమల అవసరం కూడా లేదాయె. 'మహిమలు చూపిస్తేనే విశ్వసిస్తాము' అని ప్రజలు ఒక్కోసారి ప్రవక్తల ముందు మొరాయిస్తారు. అయినప్పటికీ దేవుడు ఈ విషయమై తన ప్రవక్తలకు తిరుగులేని రీతిలో మహిమల్ని ఇవ్వలేదు. ఎవరికి, ఎంతవరకు ఇవ్వాలో అంతవరకు మాత్రమే ఇచ్చాడు. కొంతమంది ప్రవక్తలకైతే అసలు మహిమలే ఇవ్వలేదు. అదలా వుంచితే 'వలీ'ని విశ్వసించి తీరాల్సిందేనని దేవుడు ఎక్కడా చెప్పలేదు. కాబట్టి వలీలకు మహిమల అవసరం కూడా లేదు. మరలాంటప్పుడు అల్లాహ్ వారికి అవసరం లేకుండానే మహిమల్ని ఎందుకిస్తాడు?

140. అంటే – ఇహలోకంలోగానీ, పరలోకంలోగానీ వారిని శిక్షించే సమయం ఆసన్న మైనపుడు....

141. అప్పుడు వారి మధ్య న్యాయసమ్మతంగా తీర్పు జరుగుతుంది. సత్యవంతులకు బహుమానం వొసగబడుతుంది. అసత్యాన్ని అవలంబించిన వారికి శిక్ష విధించబడు తుంది.

142. అల్లాహ్ తన అసంఖ్యాక అనుగ్రహాలలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. ఇక్కడ పశువులంటే ఒంటెలు, ఆవులు, గొర్రెలని భావం. ఇవి పెంటి–పోతులన్నీ కలిపి ఎనిమిది అవుతాయి. అల్ అన్‌ఆమ్ సూరా (143, 144)లో వీటి తప్సీళ్లు వచ్చాయి.

143. ఇవి స్వారీ చేయటానికి ఉపయోగపడటమే గాకుండా, వాటి పాలు కూడా మీకు ఆహార పదార్థంగా పనికివస్తుంది. వాటి మాంసం మీకు పౌష్టికాహారంగా ఉపయోగ

**80** వాటిలో మీ కొరకు మరెన్నో ప్రయోజనాలున్నాయి.[144] మీరు వాటిపై ఎక్కి, మీ ఆంతర్యాల్లో ఉన్న అక్కరలను సాధించటానికి (అవి ఉపయోగపడుతున్నాయి) – మీరు వాటిపైన, ఓడలపైన తరలించబడుతున్నారు.[145]

وَلَكُمْ فِيهَا مَنَافِعُ وَلِتَبْلُغُوا عَلَيْهَا حَاجَةً فِي صُدُورِكُمْ وَعَلَيْهَا وَعَلَى الْفُلْكِ تُحْمَلُونَ ۝٨٠

**81** (ఈ విధంగా) అల్లాహ్ మీకు తన (శక్తి) సూచనలను చూపుతూ పోతున్నాడు.[146] మరి మీరు అల్లాహ్ సూచనల్లో వేటిని తిరస్కరించగలరు?[147]

وَيُرِيكُمْ آيَاتِهِ فَأَيَّ آيَاتِ اللَّهِ تُنكِرُونَ ۝٨١

**82** వీరు భువిలో సంచారం చేసి, తమకు పూర్వం గడచిన వారికి పట్టిన గతేమిటో చూడలేదా?[148] వారు సంఖ్యాపరంగా వీరికన్నా అధికులే. బలపరాక్రమాల రీత్యా

أَفَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَيَنظُرُوا كَيْفَ كَانَ عَاقِبَةُ الَّذِينَ مِن قَبْلِهِمْ ۚ كَانُوا أَكْثَرَ مِنْهُمْ وَأَشَدَّ قُوَّةً

---

పడుతుంది. వాటిలో కొన్ని పశువులు సుదీర్ఘ ప్రయాణాలకు కూడా ఉపయోగపడతాయి.

144. ఉదాహరణకు ఈ పశువుల చర్మాలు మీకు పలువిధాలుగా ఉపయోగపడుతున్నాయి. వాటి పాల ద్వారా వెన్న, నెయ్యి, జున్ను, పెరుగు వంటి ఆహార వస్తువులు తయారవుతున్నాయి. వాటి పేడ, కసువు సయితం మీ పొలాలకు ఎరువుగా ఉపయోగ పడుతుంది.

145. మీరేకాదు, మీ కుంటుంబ సభ్యులంతా (ఇంటిల్లిపాదీ) ఈ పశువుల వీపులపై కూర్చుని ప్రయాణాలు చేస్తుంటారు.

146. ఈ సూచనలు దేవుని అసామాన్య ప్రజ్ఞను, అద్భుత శక్తి సామర్థ్యాలను చాటిచెబుతున్నాయి. ఈ సూచనలు విశ్వమండలంలోనే గాకుండా మీ ఉనికిలో సయితం ఇమిడి ఉన్నాయి.

147. దేవుని ఈ సూచనలు అగణ్యమైనవి! స్పష్టమైనవి!! తిరుగులేనివి!!! ఏ ధిక్కారిలో కూడా వీటిని కాదనే నైతిక ధైర్యం లేదు.

148. అంటే – మీరు వర్తకం నిమిత్తం తరచూ రాకపోకలు సాగించే ప్రదేశాలలో ఎన్నో నగరాలు, మరెన్నో నాగరికతలు శిథిలావస్థలో కానవస్తున్నాయి. ఆ జాతుల వారు ఒకప్పుడు దైవాన్ని, దైవప్రవక్తలను ధిక్కరించి దైవాగ్రహాన్ని ఆహ్వానించినవారే. వారి అదిరిపాటు వారిని ఏ స్థితికి చేర్చిందో ప్రత్యేకంగా వివరించి చెప్పనవసరం లేదు – చూస్తేనే తెలిసిపోతుంది.

وَّاٰثَارًا فِی الْاَرْضِ فَمَاۤ اَغْنٰی عَنْهُمْ مَّا كَانُوْا یَكْسِبُوْنَ ۝٨٢

వీళ్లకన్నా గట్టివారే. భువిలో వారు ఎన్నో చిహ్నాలను (కూడా) వదలిపోయారు.[149] కాని వారి ఘనకార్యాలు వారికి ఏ విధంగానూ ఉపయోగపడలేదు.[150]

فَلَمَّا جَآءَتْهُمْ رُسُلُهُمْ بِالْبَیِّنٰتِ فَرِحُوْا بِمَا عِنْدَهُمْ مِّنَ الْعِلْمِ
وَحَاقَ بِهِمْ مَّا كَانُوْا بِهٖ یَسْتَهْزِءُوْنَ ۝٨٣

**83** వారివద్దకు వారి ప్రవక్తలు ఎప్పుడు స్పష్టమైన సూచనలను తీసుకువచ్చినా తమ వద్ద ఉన్న 'విద్య' ఆధారంగా వారు వికటాట్టహాసం చేసేవారు.[151] వారు దేనిని పరిహసించేవారో ఎట్టకేలకు అదే వారిపై విరుచుకుపడింది.

فَلَمَّا رَاَوْا بَاْسَنَا قَالُوْۤا اٰمَنَّا بِاللّٰهِ وَحْدَهٗ وَكَفَرْنَا بِمَا
كُنَّا بِهٖ مُشْرِكِیْنَ ۝٨٤

**84** మరి మా శిక్షను చూశాక – "ఒక్కడైన అల్లాహ్‌ను మేము విశ్వసించాము. ఆయనకు సహవర్తులుగా నిలబెడుతూ వచ్చిన వారందరినీ మేము త్రోసిపుచ్చుతున్నాం" అని చాటి చెప్పారు.

فَلَمْ یَكُ یَنْفَعُهُمْ اِیْمَانُهُمْ لَمَّا رَاَوْا بَاْسَنَا ؕ سُنَّتَ اللّٰهِ
الَّتِیْ قَدْ خَلَتْ فِیْ عِبَادِهٖ ۚ وَخَسِرَ هُنَالِكَ الْكٰفِرُوْنَ ۝٨٥

**85** కాని మా శిక్షను చూసిన తరువాత, వారి 'విశ్వాసం' వారికేవిధంగానూ లాభదాయకం కాలేకపోయింది. ఇది అల్లాహ్ సంప్రదాయం! ఇది (తరతరాలుగా) ఆయన దాసుల్లో నెరవేరుతూ వస్తోంది.[152] (దాన్ననుసరించే) అక్కడ అవిశ్వాసులు ఘోరంగా నష్టపోయారు.[153]

149. వారి ప్రాచీన కట్టడాలను, కర్మాగారాలను, వ్యవసాయ క్షేత్రాలను చూసినప్పుడు వారి పనితనం ఎటువంటిదో, జీవితపు వివిధ రంగాలలో వారెంతటి ప్రావీణ్యాన్ని సంపాదించారో అవగతమవుతుంది.

150. అంటే వారు ఆర్జించిన విద్యగానీ, వారి కీర్తి ప్రతిష్ఠలు గానీ వారికి ఒరగబెట్టిందేమిటి? వారెన్ని కీర్తి శిఖరాల అంబరాలను చుంబించే ప్రయత్నం చేసినా – ప్రకృతి ధర్మాన్ని కాదన్న కారణంగా – పతనాల లోయల్లోకే నెట్టివేయబడ్డారు.

151. ఇక్కడ వారి 'విద్య' అంటే వారు కల్పించుకున్న మూఢాచారాలు, కాల్పనిక సిద్ధాంతాలు, మిథ్యావాదాలు అని భావం. వాటిని వారి 'విద్య' అని చెప్పటంలో ఒకింత వ్యంగ్య

ధోరణి ఉంది. ఎందుకంటే వాటినే వారు మహాగొప్ప విద్యగా, అపూర్వకళగా తలపోసి మిడిసిపడేవారు. తమ దగ్గరున్న విద్య ముందు మిగిలిన సిద్ధాంతాలన్నీ పనికి మాలినవని భావించేవారు. ఆఖరికి దైవప్రవక్తలు సయితం వారి కంటికి అధములుగా కన్పించేవారు. ప్రవక్తల ప్రబోధనలు వారికి కాలం చెల్లిన మాటలుగా అనిపించేవి. లేదా వారు ధార్మిక విషయాలకు ప్రతిగా ప్రాపంచిక విషయాలకు మాత్రమే ప్రాముఖ్యం ఇచ్చేవారు.

152. అంటే – శిక్షను చవిచూసిన మీదట చెందే పశ్చాత్తాపాన్ని, ప్రకటించే విశ్వాసాన్ని దేవుడు స్వీకరించడు. ఇది ఆయన విధానం. ఆయన విధానం స్థిరమైనది. అది మారబోదు. ఈ విషయం ఖుర్ఆన్‌లో చాలా చోట్ల నిర్ద్వంద్వంగా చెప్పబడింది.

153. అంటే – శిక్షను కళ్లారా చూసిన పిదప, తమ కొరకు నష్టం, వినాశం తప్ప మరొకటి లేదన్న యదార్థం వారికి అర్థమైపోయింది.